ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -294 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం 8 ఫిబ్రవరి 2026

# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

## అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన

**ఇది చారిత్రక ఘట్టం: సీఎం చంద్రబాబు**

**క్వాంటమ్ కంప్యూటింగ్‌కు కేంద్ర సహకారం**

**టెక్నాలజీ అభివృద్ధిలో కీలకం కానుందన్న కేంద్రమంత్రి జితేంద్ర సింగ్**

**ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య**

**క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా**

**అమరావతి ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
"ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం మిగతా 2లో...




# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్

**కౌలాలంపూర్‌లో ప్రధాని మోడీ ప్రకటన**

**ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస భారతీయులు**




**కౌలాలంపూర్,ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు చేయనున్నట్టు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రెండ్రోజుల మలేసియా పర్యటన నిమిత్తం శనివారంనాడు కౌలాలంపూర్ చేరుకున్న ఆయనకు మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం సాదర స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ నృత్యాలతో ప్రవాస భారతీయులు ఆహ్వానం పలికారు. అనంతరం కౌలాలంపూర్ లోని భారత సంతతి ప్రజలతో ఆత్మీయ సమ్మేళనంలో మోదీ పాల్గొన్నారు. భారత్ పదేళ్లలో వేగంగామిగతా 2లో...

# రాష్ట్రంలో ఏకో టూరిజం అభివృద్ధికి కృషి



**కేరళ తరహాలో హౌజ్ బోట్ల నిర్మాణం**

**పర్యాటక రంగానికి బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యం**

**నంది అవార్డులపై త్వరలోనే నిర్ణయం**

**పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**

రాజమండ్రి,**ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచన మేరకు రాష్ట్రంలో ఏకో టూరిజం అభివృద్ధి చేస్తున్నాం.. సినిమా టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.మిగతా 2లో...

# దర్యాప్తుకు తప్పనిసరి అని భావించినపుడే 'అరెస్ట్' చేయాలి

**పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు**

**ప్రశ్నించాలనే కారణంతో అరెస్ట్ చేస్తానంటే కుదరదని హెచ్చరిక**

**ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో ఇష్టారీతిన అరెస్టులు సరికాదని వ్యాఖ్య**

న్యూఢిల్లీ**ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
కేసు విచారణలో భాగంగా ఎవరినైనా ప్రశ్నించేందుకు అరెస్టు చేయడం సరికాదని దేశ అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ముఖ్యంగా ఏడేళ్ల లోపు శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో ఎడాపెడా అరెస్టులు కుదరవని స్పష్టం చేసింది.మిగతా 2లో...



# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

**కంప్యూటర్లు, ఫైల్స్ దగ్ధం**

**పలు కీలక కేసుల ఆధారాలు ల్యాబ్‌లోనే..**

**ఫోన్ ట్యాపింగ్, ఓటుకు నోటు, ఎమ్మెల్యేల కొనుగోలు కేసుల డేటా ఇక్కడే !**

**మెహిదీపట్నంఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
హైదరాబాద్ నాంపల్లిలోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్-ఎల్)లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ల్యాబ్‌లోని మొదటి అంతస్తులో ఉన్న కంప్యూటర్ మిగతా 2లో...




# శ్రీశైలంలో 8 నుంచి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



శ్రీశైలం **ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల జిల్లా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఫిబ్రవరి 8 నుంచి 18వ తేదీ వరకు 11 రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు ప్రకటించారుమిగతా 2లో...

# చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే

**ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర**

**పథకాన్ని నీరుగారుస్తున్న కేంద్ర బిజెపి**

**ఏపి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**



తిరుపతి,**ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి రచ్చబండ కార్యక్రమాన్ని శనివారం

# ఇది ఒక భవనానికి పునాది కాదు... భవిష్యత్తుకు పునాది: నారా లోకేశ్

**అమరావతిలో క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన**

**టెక్నాలజీలో భారత్ భవిష్యత్ నాయకత్వానికి ఇది పునాది అన్న లోకేశ్**

**సీఎం ముందుచూపు అద్భుతం అని కితాబు**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన చేయడం కేవలం ఒక భవనానికి పునాది రాయి వేయడం కాదని, క్వాంటం టెక్నాలజీ రంగంలో భారతదేశ భవిష్యత్ నాయకత్వానికి ఇక్కడే పునాది మిగతా 2లో...



# ఇకపై 18 శాతం పన్ను

**అదనపు టారిఫ్ లను తగ్గించిన ట్రంప్..**

**ట్రేడ్ డీల్ నేపథ్యంలో శుక్రవారం అమెరికా అధ్యక్షుడి ప్రకటన**

**రష్యా చమురు దిగుమతుల నిలిపివేతకు భారత్ కట్టుబడి ఉందని వెల్లడి**

**25 శాతం ప్రతీకార సుంకాలను తగ్గిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై సంతకం**



# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..

(మొదటి పేజి తరువాయి)
అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు.





ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం" అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ గ్నిప్రమాదం

(మొదటి పేజి తరువాయి)
ల్యాబ్‌లో తొలుత మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలోనే ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది బయటకు పరుగులు తీసింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని 5 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ఈ ప్రమాదంలో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయని తెలిసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ల్యాబ్‌లో కీలకమైన కేసులు, ఫోరెన్సిక్ ఆధారాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏవైనా దెబ్బతిన్నాయా? అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.

**ఏ వస్తువులు దగ్ధమయ్యాయో నిర్ధారణ కాలేదు : డీసీపీ శిల్పవల్లి**
ల్యాబ్‌లో అగ్ని ప్రమాదంతో ఏ ఏ వస్తువులు దగ్ధమయ్యాయన్నది ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదని



ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైళ్లు, ఆధారాలు భద్రపరిచే ఎవిడెన్స్ లాబరేటరీ కార్యకలాపాలు ఈ భవనం నుంచే నిర్వహిస్తారని తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పనిచేస్తున్న వార్డు బాయ్ కృష్ణ మంటలను ఆర్పే ప్రయత్నంలో అపస్మారక స్థితిలోకి వెళ్లగా, అతడిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ప్రమాదం జరిగిన సమయంలో ల్యాబ్‌లో నలుగురు ఉద్యోగులు ఉన్నారని, మంటలను గమనించిన వెంటనే వారు బయటకు వచ్చేశారని అన్నారు.

**కీలకమైన కేసుల ఆధారాలన్నీ ల్యాబ్‌లోనే..**
నాంపల్లిలో ఉన్న స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో భారీ అగ్నిప్రమాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన ఆధారాలు అగ్నికి ఆహుతి అయ్యాయని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు కీలక కేసులకు సంబంధించి ఆధారాలు కాలి బూడిదైనట్టు తెలుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రాజకీయ ప్రకంపనలు సృష్టించిన అనేక కేసులకు సంబంధించిన కీలక ఆధారాలు సైతం ఆ ల్యాబ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఫైల్స్ అన్నీ అగ్నికి ఆహుతైనట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కులు, డిజిటల్ డేటా విశ్లేషణ ఇక్కడే జరుగుతున్నట్టు తెలుస్తోంది. వీటితోపాటు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌ల ఒరిజినల్ ఫైల్స్ ఇక్కడి కంప్యూటర్లలోనే నిక్షిప్తమై ఉన్నట్టు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయంగా సంచలనం రేపిన ఎమ్మెల్యేల కొనుగోలు యత్నం కేసులో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, వాటికి సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు సైతం ఇక్కడే ఉన్నట్టు తెలుస్తోంది.

# రాష్ట్రంలో ఏకో టూరిజం అభివృద్ధికి కృషి

(మొదటి పేజి తరువాయి)
రాజమండ్రిలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పర్యాటక రంగానికి బ్రాండ్ ఇమేజ్ పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళు_న్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.150 కోట్ల పెట్టుబడులు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సినిమా టూరిజం అభివృద్ధి ద్వారా రాష్ట్రానికి కొత్త గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఇక, కేరళ మోడల్‌ను అనుసరిస్తూ రాజమండ్రి, విజయవాడ నగరాల్లో హౌస్ బోట్లను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉందని కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నదిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యమన్నారు. అయితే, గత వైసీపీ పాలనలో పర్యాటక రంగం పూర్తిగా నాశనమైందని మంత్రి విమర్శించారు. టూరిజంతో పాటు కళాకారులను కూడా మోసం చేశారని ఆరోపించారు. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు ఇకపై ఉగాది అవార్డులు అందజేస్తామని ప్రకటించారు. ఃాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు మంత్రి కందుల దుర్గేష్? ఇందులో అధిక శాతం ఉద్యోగాలు పర్యాటక శాఖ ద్వారా కల్పించాలన్నదే పవన్ కల్యాణ్, చంద్రబాబు నాయుడు ప్రభుత్వ సంకల్పం అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా సాగుతోందని మంత్రి అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ తరహాలో అమరావతిలో 'క్వాంటమ్ వాలీ' నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.428 కోట్ల పెట్టుబడులు సమకూర్చినట్లు చెప్పారు. మరోవైపు.. 2027 జూన్ 26 నుంచి 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని మంత్రి ప్రకటించారు. గోదావరి నది పొడవున ఎక్కడ స్నానం చేసినా పుష్కర పుణ్యం లభిస్తుందనే విధంగా ప్రచారం చేస్తామని తెలిపారు. టూరిజం, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఈ సందర్భంగా కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. నంది అవార్డులపై ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ కీలక ప్రకటన చేశారు. నంది నాటకోత్సవాలు, అవార్డులపై కార్యాచరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడామని తెలిపారు. రెండు, మూడు నెలల్లోనే నంది అవార్డులు ప్రదానం చేస్తామని స్పష్టం చేశారు. ఫిలిం టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వ్యాఖ్యానించారు. కొత్త టూరిజం పాలసీ ద్వారా ఏపీలో 4,373 హోటల్స్‌లో రూమ్‌లు ఏర్పాటు చేశామని మంత్రి దుర్గేశ్ పేర్కొన్నారు. రూ.428 కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని వివరించారు. ఈ ఏడాది నుంచి సీ ప్లేన్ టూరిజాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. 7 యాంకర్ హబ్‌లు ఏర్పాటు చేశామన్న ఆయన.. రూ.115 కోట్లతో హరిత హోటల్స్‌ను ఆధునికీకరించామని వెల్లడించారు. పురాతన మండువా ఇళ్లను.. హోంస్టేలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఏపీలో ఉన్న 21 పుణ్యక్షేత్రాల్లో టెంట్‌హౌస్‌లు ఏర్పాటు చేస్తామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఏపీలో 21 హౌస్‌బోట్లు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. ఈ ఏడాది జూన్ 26 నుంచి జులై 7 వరకు గోదావరి పుష్కరాలని అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ పుష్కరాల్లో తొక్కిసలాట ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సూర్యరాయ ఆంధ్ర నిఘంటువును తిరిగి ముద్రించేందుకు చర్యలు చేపట్టామని వెల్లడించారు. అంతర్జాతీయ పర్యాటక డెస్క్‌ను ఏర్పాటు చేస్తామన్న దుర్గేశ్.. వెల్‌నెస్ సెంటర్లను సముద్ర తీర ప్రాంతంలో ఏర్పాటుచేసి పర్యాటక భవన్‌ను అమరావతిలో ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో పర్యాటక రంగాన్ని నాశనం చేశారని ఆరోపించారు. జగన్ హయాంలో కళాకారులను హీనంగా చూశారని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇది ఒక భవనానికి పునాది కాదు... భవిష్యత్తుకు పునాది: నారా లోకేశ్

(మొదటి పేజి తరువాయి)
వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శనివారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే ఇది సాధ్యమవుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు జితేంద్ర సింగ్, పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, స్టార్టప్ ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

చరిత్ర పునరావృతం అవుతుంది

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "కొన్నేళ్ల క్రితం ప్రపంచం సాఫ్ట్‌వేర్ సేవల గురించి ఆలోచించడం మొదలుపెట్టినప్పుడు, ఒక దార్శనిక నాయకుడు 'హైదరాబాద్‌ను ప్రపంచ ఐటీ రాజధానిగా ఎందుకు మార్చకూడదు?' అని ధైర్యంగా ప్రశ్నించారు. ఆ ఒక్క ప్రశ్న చరిత్రను మార్చేసింది. మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలు భారత్‌కు వచ్చాయి, లక్షల ఉద్యోగాలు వచ్చాయి. ఒక నగరం రూపురేఖలే కాకుండా ప్రపంచంలో భారతదేశ స్థాయినే మార్చేసిన ఐటీ విప్లవం మొదలైంది. ఆ దార్శనిక నాయకుడే మన ముఖ్యమంత్రి చంద్రబాబు" అని వివరించారు. "ఈ రోజు, మరింత లోతైన సాంకేతికతలు, పెద్ద సవాళ్లు, గొప్ప అవకాశాలతో నిండిన కొత్త శకంలో, ఆయన మరో కీలక ప్రశ్న సంధించారు. 'భారత్ క్వాంటం విప్లవాన్ని అనుసరించడం కాదు, ఎందుకు నాయకత్వం వహించకూడదు?' అని అడిగారు. ఆ ప్రశ్నకు సమాధానమే ఈ అమరావతి క్వాంటం వ్యాలీ" అని లోకేశ్ ఉద్ఘాటించారు. ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంటూ, "ముఖ్యమంత్రి గారు ప్రొఫెసర్ కామకోటి గారితో సమావేశం తర్వాత నన్ను పిలిచి, క్వాంటం ఎకోసిస్టమ్‌ను సృష్టించాలని చెప్పారు. అప్పుడు నేను వెంటనే నా ఫోన్ తీసి, 'క్వాంటం కంప్యూటింగ్ అంటే ఏమిటో ఒక పేజీలో వివరించండి' అని చాట్‌జీపీటీని అడిగాను. ఆ సమాధానం చూశాక, తర్వాతి తరం టెక్నాలజీ ఎక్కడ ఉందో అర్థం చేసుకోవడంలో మన సీఎం అంత ముందున్నారన్న విషయం అర్థమైంది. ఇతరులు క్వాంటం అంటే ఏమిటో ఇంకా చర్చిస్తుంటే, ఈ మిషన్‌కు భారతదేశం ఎలా నాయకత్వం వహించాలనే దానిపై మన ముఖ్యమంత్రి అప్పుడే ప్రణాళికలు రచిస్తున్నారు. అదే ఆయన నాయకత్వ పటిమ, ముందుచూపు" అని లోకేశ్ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న రెండు ప్రధాన బలాల గురించి లోకేశ్ వివరిస్తూ, "మొదటిది, నిరూపితమైన ట్రాక్ రికార్డ్ ఉన్న చంద్రబాబు గారి నాయకత్వం. ఇక్కడికి వచ్చే పెట్టుబడిదారులు కేవలం వాగ్దానాలు వినరు, చరిత్ర సృష్టించడం చూస్తారు. రెండవది, పనులను పూర్తి చేయడంలో మాకున్న అసమానమైన వేగం. ఇతర రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 'డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్' ఉంది" అని అన్నారు.

# మలేసియాలో త్వరలో కొత్త కాన్సులేట్

(మొదటి పేజి తరువాయి)
సాధిస్తున్న ప్రగతిని ఈ సందర్భంగా మోదీ వివరిస్తూ, పదేళ్ల క్రితం 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ప్రస్తుతం మూడో స్థానానికి చేరిందన్నారు. ఇండియాలో చదువుకునే విద్యార్థులకు త్వరలోనే తిరువళ్లువర్ స్కాలర్‌షిప్‌లు ఇస్తామని చెప్పారు. యూకే, యూఏఈ, అస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుందని, విశ్వాసం భారతదేశపు బలమైన కరెన్సీగా మారిందని పేర్కొన్నారు. ఇండియాను ఒక పెద్ద మార్కెట్‌గానే గతంలో చూసేవారని, ఇప్పుడు పెట్టుబడులు, వాణిజ్యానికి హబ్‌గా మారిందని మోదీ తెలిపారు. అభివృద్ధికి విశ్వసనీయమైన భాగస్వామిగా భారత్ నిలుస్తోందన్నారు. యూకే, యూఏఓ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఒమన్, ఈయూ, యూఎస్‌ఏ సహా అనేక దేశాలు ఇండియాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయని చెప్పారు. మలేసియాను ప్రపంచం లోనే అతిపెద్ద భారతీయ ప్రవాస జనాభాను కలిగిన రెండో దేశంగా మోదీ పేర్కొన్నారు. భారత్-మలేసియా ప్రజల హృదయాలను కలుపుతూ, రెండు దేశాల మధ్య వారధిగా ప్రవాస భారతీయులు నిలుస్తున్నారని ప్రశంసించారు. ఆహారపు అలవాట్లు, భాషా పరంగా ఎన్నో ఇరుదేశాల ప్రజల మధ్య ఎన్నో సామీప్యాలు ఉన్నాయని అన్నారు. భారతీయ సంగీతం, చలనచిత్రాలకు మలేసియాలో ఎంతో ఆదరణ ఉన్నట్టు విన్నానని, ప్రధాని అన్వర్ ఇబ్రహీం కూడా బాగా పాడతారనే విషయం ఇక్కడి వారందరికీ తెలిసిందేనని అన్నారు. భారత్‌కు తిరిగి వచ్చిన చాలామందికి ఈ విషయం తెలియదని, తాను గత పర్యటనలో ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పారు. ఇండియాలోని పాపులర్ హిందీ గీతాలను అన్వర్ ఇబ్రహీం ఆలపిస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయని, లెజెండ్రీ ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన బాగా ఇష్టపడతారని అన్నారు. దీనికి ముందు, భారత్‌కు చెందిన 800 మందికి పైగా నృత్యకారులు ప్రధానికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్ట్ నుంచి మోదీ, అన్వర్ ఇబ్రహీం కలిసి ఒకే కారులో ప్రయాణించారు. భారత సంతతి ఆత్మీయ సమ్మేళనం వద్ద 'భారత్ మాతా కీ జై', 'మోదీ, మోదీ' అనే నినాదాలతో ఆయనకు సాదర స్వాగతం లభించింది.

# చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే

(మొదటి పేజి తరువాయి)
వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిన మహాత్మా గాంధీ జాతి ఉపాధి హామీ పథకం చట్టాన్ని బిజెపి ప్రభుత్వం నీరుగారుస్తుందని,పేదల కడుపు కొట్టేందుకే పథకం పేరు మార్చి 125 రోజులు పెంచుతున్నట్లు బూటకపు మాటలు చెబుతున్నారని తెలిపారు. 8 గంటల ఉన్న పనిని 12 గంటలు చేశారని, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం,కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తామని చెప్పడం పేద ప్రజలకు ద్రోహం చేసినట్లు కాదా అని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు ఆచరణలో పెట్టాయని తెలిపారు.గ్రామాలలో గుడులు, బడులు లేకపోయినా బెల్ట్ షాపులు మాత్రం అధికంగా ఉన్నాయని,రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని,రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యంతో ఉందని తెలిపారు.మళ్లీ మన అందరి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అటు దేశం అభివద్ధి పథంలో దూసుకుపోతుందని వైయస్ షర్మిల తెలియజేశారు.పై కార్యక్రమంలో తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలగురువం బాబు,కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ మావుడూరు వెంకటాచలపతి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, నియోజకవర్గ ఇన్చార్జ్‌లు, మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# దర్యాప్తుకు తప్పనిసరి అని భావించినపుడే 'అరెస్ట్' చేయాలి

(మొదటి పేజి తరువాయి)
కేవలం ప్రశ్నించాలనే కారణంతో అరెస్టు చేయడాన్ని తప్పుబట్టింది. దర్యాప్తులో భాగంగా తప్పనిసరి అని భావించినపుడు ముందస్తుగా నోటీసు జారీ చేశాక అరెస్టు చేయాలని పోలీసులకు సూచించింది.భారత న్యాయ సంహిత ప్రకారం నోటీసులు జారీ చేసినప్పటికి అరెస్టు తప్పనిసరి కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు సతేందర్ కుమార్ అంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కే సింగ్ ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛతో కూడుకున్న విషయం కాబట్టి అరెస్టుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు సూచించింది.

**సుప్రీం బెంచ్ సూచనలు ఇవే..**
క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదు అందిన తర్వాత రెండు దశల పద్ధతిని పాటించాలని దర్యాప్తు అధికారికి కోర్టు సూచించింది. సదరు కేసు విచారణలో అరెస్టు తప్పనిసరా? కాదా?.. బీఎన్ఎస్ సెక్షన్ 33, సెక్షన్ 35 ప్రకారం అరెస్టు చెయ్యవచ్చా? లేదా? అనేది వ్యక్తిగతంగా నిర్ణయించుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఆర్టికల్ 21 (వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు) ప్రకారం పౌరులకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని; నిందితుడు, సహ నిందితుడనే భేదాలు ఏవీ మినహాయింపు కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్టుకు సంబంధించి పోలీసులకు చట్టం కల్పించిన మినహాయింపులనూ సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బీఎన్ఎస్ సెక్షన్ 35(1)(బి) ప్రకారం.. ఎలాంటి వారెంట్ లేకున్నా పోలీసులు అరెస్టు చేయవచ్చనే నిబంధనను ప్రస్తావిస్తూ.. ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయొచ్చుని భావించరాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

# ఇకపై 18 శాతం పన్ను

## అదనపు టారిఫ్ లను తగ్గించిన ట్రంప్..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ కు శుభవార్త చెప్పారు. ఇటీవల భారత్ పై విధించిన ప్రతీకార సుంకాల (25 శాతం) ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రష్యా నుంచి చమురు దిగుమతులను ఆపేసే విషయంలో భారత్ కట్టుబడి ఉందని, దీంతో టారిఫ్ లను తగ్గిస్తున్నామని ట్రంప్ చెప్పారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ పై ఆయన శుక్రవారం సంతకం చేశారు. అమెరికా, భారత్ ల మధ్య ఇటీవల కుదిరిన ట్రేడ్ డీల్ లో భాగంగా 7 శాతం టారిఫ్ లను ట్రంప్ తగ్గించిన విషయం తెలిసిందే. తాజా ప్రకటనతో భారత్ పై అమెరికా పన్నుల భారం 18 శాతానికి తగ్గింది.రష్యా ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై ట్రంప్ అప్పట్లో ప్రతీకార సుంకాలు విధించారు. ఆయా దేశాల నుంచి అగ్రరాజ్యానికి దిగుమతి అయ్యే వస్తుసేవలపై 25 శాతం పన్నులు విధించి అమలు చేశారు. ఈ జాబితాలో భారత్ కూడా ఉంది. దీనికితోడు భారత్ పై అదనపు సుంకాలు మరో 25 శాతం విధించారు.మొత్తంగా 50 శాతం టారిఫ్ లు విధించడంతో భారత ఎగుమతిదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఇటీవల కుదిరిన ట్రేడ్ డీల్ తర్వాత అదనపు సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి ట్రంప్ తగ్గించారు. దీంతో భారత్ పై ప్రతీకార సుంకాలు 25 శాతం, అదనపు సుంకాలను 18 శాతం అమెరికా అధికారులు వసూలు చేశారు. ట్రంప్ తాజా ప్రకటనతో ఇకపై భారత వస్తుసేవల మీద కేవలం 18 శాతం పన్నులు మాత్రమే వసూలు చేయనున్నారు.

# శ్రీశైలంలో 8 నుంచి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

.(మొదటి పేజి తరువాయి)
. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం సుమారు 30 శాతం మంది భక్తులు ఎక్కువగా శ్రీశైలం క్షేత్రానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ అంచనాలకు అనుగుణంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 8న ఉదయం శ్రీ స్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 9 నుంచి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారికి వివిధ వాహన సేవలు, గ్రామోత్సవం జరుగుతాయి. ఈనెల 12న రాష్ట్ర ప్రభుత్వం తరపున భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం :** ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ రమేశ్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు నేడు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనం అందించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, ఆలయ బోర్డు సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా హాజరుకావాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సీఎం చంద్రబాబును ఆహ్వానించారు

# వాయిస్ క్లోనింగ్ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## ఏఐ సాయంతో బంధువుల గొంతు క్లోన్ చేసి డబ్బులు దోచుకుంటున్నారు : కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరిక

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 7)**
వాయిస్ క్లోనింగ్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల పట్ల జిల్లా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సూచించారు.
శనివారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఏఐ వాయిస్ క్లోనింగ్‌కు సంబంధించిన కొత్త తరహా స్కామ్‌లు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. స్కామర్లు ఇప్పుడు ఆధునిక సాంకేతికతను వినియోగించి, బంధువులు లేదా స్నేహితుల గొంతును క్లోన్ చేసి అత్యవసర సహాయం పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వెంటనే బదిలీ చేయమని కోరుతున్నారని వెల్లడించారు.
డబ్బు పంపిన తర్వాత, అసలు సంబంధిత వ్యక్తిని ప్రత్యక్షంగా కలిసినప్పుడు లేదా సంప్రదించినప్పుడు తాము



మోసపోయామని బాధితులు గ్రహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ప్రత్యేకంగా అత్యవసర ఆర్థిక సహాయం కోరే కాల్స్ వచ్చినప్పుడు, ఎలాంటి చర్య తీసుకునే ముందు తప్పనిసరిగా ధృవీకరించబడిన నంబర్ ద్వారా సంబంధిత వ్యక్తిని సంప్రదించి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు.
సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు
సోషల్ మీడియా, వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదు
బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం నంబర్, ఓటీపీ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదు
అనధికారిక వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా కొనుగోళ్లు చేయవద్దుఅధికారిక షాపింగ్ యాప్‌లు లేదా వెబ్‌సైట్లను మాత్రమే వినియోగించాలి
సోషల్ మీడియాలో కనిపించే అతిగా తక్కువ ధరల ఆఫర్లను నమ్మవద్దుఏదైనా సైబర్ మోసానికి గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా **www.cybercrime.gov.in** వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# యాంటీ ఈవ్‌టీజింగ్‌పై కర్నూలు పోలీసుల కఠిన నిఘా

**-పాఠశాలలు, కళాశాలల వద్ద బీట్స్ తనిఖీలు**
**- కఠిన చర్యలు తప్పవు ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 7)**
జిల్లాలో ఈవ్‌టీజింగ్, ఆకతాయి చర్యలకు చెక్ పెట్టేందుకు కర్నూలు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు యాంటీ ఈవ్‌టీజింగ్ బీట్స్‌ను పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, వివిధ విద్యాసంస్థల పరిధిలో యాంటీ ఈవ్‌టీజింగ్ బీట్స్‌ను ఏర్పాటు చేసి, అనుమానాస్పదంగా ప్రవర్తించే వ్యక్తులపై నిఘా ఉంచుతున్నారు. ఈవ్‌టీజింగ్



లేదా ఆకతాయి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈవ్‌టీజింగ్ లేదా ఇతర ఇబ్బందులు ఎదురైతే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, లేకపోతే డయల్ 112 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని విద్యార్థినులు,



విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యాసంస్థల వద్ద యాంటీ ఈవ్‌టీజింగ్ బీట్స్ పోలీసులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, అవసరమైన చోట కౌన్సిలింగ్ నిర్వహిస్తూ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నారు.

# ప్రజాధనంతో చేపట్టే పనుల్లో నాణ్యత తప్పనిసరి

**అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్ విశ్వనాథ్ -నగరంలో రూ.29.81 కోట్లతో అభివృద్ధి పనులు నాణ్యతపై రాజీ లేదు**
**అన్న క్యాంటీన్లను ప్రతిరోజూ నోడల్ అధికారులు పరిశీలించాలి కమిషనర్ పి.విశ్వనాథ్**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 7)**
నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ తెలిపారు. శనివారం 19వ వార్డులోని హోసన్నా మందిర్ రోడ్డులో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రహదారి పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో వాకీటాకీ ద్వారా సమీక్షించారు.
ప్రజాధనంతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. సిమెంట్, ఇసుక, గ్రావెల్, నీటి నాణ్యతను తప్పనిసరిగా పరీక్షించి ప్రమాణాలకు అనుగుణమైన పదార్థాలనే గుత్తేదారులు ఉపయోగించేలా ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంలో క్షేత్రస్థాయిలో అమినిటీస్ కార్యదర్శుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణమే పరిష్కరించుకోవాలని సూచించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా సరైన స్లోప్ ఏర్పాటు చేయాలని, కాంక్రీట్ పోసిన అనంతరం కనీసం రెండు వారాల పాటు క్యూరింగ్ తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. నగరంలో మొత్తం రూ.29.81 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో రూ.25.25 కోట్లు సాధారణ నిధులు, రూ.4.16 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు కాగా, అదనంగా రూ.40 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అన్న క్యాంటీన్ల సేవలను మరింత మెరుగ్గా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆయన పరిశీలించి, ప్రజలకు అందించే భోజనం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు ఎల్లప్పుడూ కచ్చితంగా పాటించేలా నోడల్ అధికారులు పనిచేయాలని



సూచించారు. ఆహారం తాజాగా, శుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, భోజన తయారీ నుంచి పంపిణీ వరకు అన్ని ప్రక్రియలను నోడల్ అధికారులు ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వచ్ఛత, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమినిటీస్ కార్యదర్శి శ్వేత రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మంత్రి నారా లోకేశ్ కు ఆహ్వానం

**శ్రీశైలం ఫిబ్రవరి 7 (రిపబ్లిక్ న్యూస్)**
శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 8 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులను ఆహ్వానించడం



జరుగుతోంది. కాగా ఈ రోజు రాష్ట్ర మానవ వనరులశాఖ అభివృద్ధి మరియు ఐ.టీ, కమ్యూనికేషన్లశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేశ్ గారికి ఆహ్వానపత్రికను అందజేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీబుడ్డారాజశేఖరరెడ్డి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకస్వాములు, వేదపండితులు మంత్రివర్యులను కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులకు వేదాశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేయడం జరిగింది.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డికి ఆహ్వానం



**శ్రీశైలం ఫిబ్రవరి 7 (రిపబ్లిక్ న్యూస్)**శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 8 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయిఈ సందర్భంగా పలువురు ప్రముఖులను ఆహ్వానించడం జరుగుతోంది. అదేవిధంగా ఈ రోజు శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డికి ఆహ్వానపత్రికను అందజేసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది.
ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి యం.హరిదాసు వేదపండితులు, ప్రధానార్చకులు కలిసి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది.
ఈ కార్యక్రమములో నియోజకవర్గం శాసనసభ్యులకు వేద ఆశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాల అందజేయడం జరిగింది.

## క్యాబ్ బుకింగ్ తరహాలో డ్రోన్ సేవలు అందుబాటులోకి



**నంద్యాల, ఫిబ్రవరి 07( రిపబ్లిక్ న్యూస్)**క్యాబ్ బుక్ చేసుకున్నంత సులభంగా వ్యవసాయ అవసరాల కోసం డ్రోన్ సేవలను వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో డ్రోన్ సేవలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న "యుబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్" యాప్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డ్రోన్ సేవలను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ డ్రోన్ సేవల ద్వారా పురుగుమందులు, ఎరువులు, విత్తనాలను వ్యవసాయ భూములపై చల్లే సౌకర్యం ఉందని, దీని వల్ల సమయం, కూలీల వ్యయం గణనీయంగా ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఒకే యాప్‌లో అనేక వ్యవసాయ సేవలు పొందే వీలుందని తెలిపారు.రైతులకు మరింత సౌలభ్యం కల్పించే దిశగా, ప్రతి ప్రాంతంలో అద్దెకు డ్రోన్ సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్




**పత్తికొండ ఫిబ్రవరి 7 (రిపబ్లిక్ న్యూస్)**పత్తికొండ పట్టణంలో శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్2026ను గౌరవనీయులైన పత్తికొండ ఎమ్మెల్యే శ్రీ కే.ఈ. శ్యామ్ కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ 07-02-2026 నుండి 09-02-2026 వరకు పత్తికొండలోని సొసైటీ బ్యాంక్ గ్రౌండ్ ఎస్ ఎస్ టిలో నిర్వహించబడుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ కే.ఈ. శ్యామ్ కుమార్ గారు మాట్లాడుతూ, గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణతో పాటు ఐక్యత పెరుగుతుందని తెలిపారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.50,000/-, రెండవ బహుమతిగా రూ.30,000/-, మూడవ బహుమతిగా రూ.20,000/- మరియు నాల్గవ బహుమతిగా రూ.10,000/- అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కల్లూరు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**16 వార్డుల అభివృద్ధి పనుల సమీక్షలో ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి**
**340-సి రహదారి విస్తరణకు టిడిఆర్ ప్రక్రియ వేగవంతం తాగునీరు, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధిపై దృష్టి**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 7)**
కర్నూలు నగర పరిధిలోని కల్లూరు అర్బన్ ప్రాంత సమస్యల పరిష్కారానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తామని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్‌తో కలిసి కల్లూరు పరిధిలోని 16 వార్డుల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య కూడలి నుంచి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు 340-సి రహదారి విస్తరణకు సంబంధించి టిడిఆర్‌ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో ఆక్రమణకు గురైన పార్కును పరిరక్షించాలని, వీధి దీపాల మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అలాగే వీధి కుక్కల బెడద నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్రీయ విద్యాలయం సమీపంలోని రహదారిపై ఉన్న అక్రమ షాపులను తొలగించాలని, సచివాలయాల్లో కనీస సిబ్బందిని నియమించి పని వేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడుతున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వక్ఫ్ బోర్డు స్థలాలకు పన్నులు విధిస్తున్న అంశంపై విచారణ చేపట్టాలని సూచించారు. ధనలక్ష్మి పార్కుతో పాటు పెండింగ్‌లో ఉన్న పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుని ప్రజలకు వీలైనంత ఎక్కువగా నీరు అందేలా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందిగా మారిన ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల మార్పునకు తగిన స్థలాన్ని గుర్తించాలని సూచించారు. వివిధ వార్డుల నాయకులు లేవనెత్తిన సమస్యలపై కమిషనర్ పి. విశ్వనాథ్ స్పందిస్తూ, చట్ట పరిధిలో సాధ్యమైన పరిష్కారాలకు చర్యలు తీసుకుంటామని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పౌరులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డా. నాగ ప్రసాద్ బాబు, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, ఆర్వోలు జునైద్, వాజీద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాష, డిఈలు, ఏఈలు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా రహిత జిల్లాగా కర్నూలు

# పాత నేరస్తులపై కఠిన నిఘా

## పండుగలుజాతరల వేళ పొరుగు రాష్ట్రాల మద్యం అడ్డుకట్టకు నిరంతర దాడులు

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఫిబ్రవరి 7)**
కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శ్రీమతి పి. శ్రీదేవి తమ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇప్పటికే కర్నూలు జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా ప్రకటించిన నేపథ్యంలో, తిరిగి నాటు సారా తయారీ జరగకుండా పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వారందరినీ బైండోవర్ చేయాలని అధికారులను ఆదేశించారు.అలాగే నాటు సారా మానివేసిన వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.జిల్లాలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న జాతరలు, పండుగల దృష్ట్యా, పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం జిల్లాలోకి ప్రవేశించకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేసి దాడులు కొనసాగించాలని ఆదేశించారు.పొరుగు





రాష్ట్రాల మద్యం కేసులు, గ్రేవ్ క్రైమ్ కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి చార్జ్‌షీట్లు కోర్టుకు సమర్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
అలాగే గంజాయి పెంపకం, ఇతర నార్కోటిక్ డ్రగ్స్ సరఫరాను అరికట్టేందుకు సమాచారం సేకరించి దాడులు చేయాలని, పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసుల్లో మ్యాజిస్ట్రేట్ ద్వారా ఇన్వెంటరీ ప్రక్రియ పూర్తి చేసి చార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలోఅసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రావిపాటి హనుమంతరావు,కర్నూలు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మచ్చ సుధీర్ బాబు,నంద్యాల జిల్లా ఎక్సైజ్ అధికారి ఎస్. రవికుమార్,అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు డి. రామకృష్ణారెడ్డి, వి. రాముడుమరియు కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా

# వైద్య సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలి

### పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్

**పత్తికొండ ఫిబ్రవరి 7 (రిపబ్లిక్ న్యూస్)**
పత్తికొండ ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో 5 కోట్ల 75 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆసుపత్రి అదనపు గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే కే.ఈ. శ్యామ్ కుమార్ గారు భూమి పూజ నిర్వహించారు. అనంతరం వైద్యులతో సమావేశం నిర్వహించి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలను పరిశుభ్రంగా





నిర్వహిస్తున్నందుకు డాక్టర్లు మరియు ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, టెక్నికల్ సిబ్బంది సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, మందుల సరఫరా పరిస్థితిపై ఆరా తీసి, ఆసుపత్రిని పరిశీలించారు.
వైద్య సేవలపై అక్కడ చికిత్స పొందుతున్న రోగులతోనూ మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్






### రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**అనంతపురం వైద్యం, ఫిబ్రవరి 07,( రిపబ్లిక్ న్యూస్ ):**
వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్ ను అబివృద్ధి చెందిన భారత్ గా బడ్జెట్ ప్రవేశ పెట్టారని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షతన కేంద్ర బడ్జెట్ మీద మేధావులు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

**అభివృద్ధి బడ్జెట్ గా తీసుకురావడం గర్వకారణం**
ఈ సందర్భంగా సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ బడ్జెట్ వికసిత్ భారత్ దిశగా ఉన్న బడ్జెట్ అని పేర్కొన్నారు. మోదీ గారి నాయకత్వంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశి పెట్టిన బడ్జెట్ బిన్నంగా కేవలం ఆకర్షణ బడ్జెట్ కాకుండా అభివృద్ధి బడ్జెట్ గా తీసుకురావడం గర్వకారణమన్నారు. అందులో భాగంగా 2047 సంవత్సరంగాను అబివృద్ధి చెందిన భారత్ గా బడ్జెట్ ప్రవేశ పెట్టారని,ముఖ్యంగా రక్షణ రంగంలో ఎక్కువ బడ్జెట్ కేటాయించి ప్రపంచంలో ఒక బలమైన దేశంగా ఇది దోహదపడుతుందన్నారు.

**అమరావతి అభివృద్ధి కొరకు రూ.1128.19 వేల కోట్లు**
వ్యవసాయ రంగంలో రూ.1.60 లక్షల కోట్లు, విద్యకు రూ.1.45 వేల కోట్లు, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ అమరావతి అభివృద్ధి కొరకు రూ.1128.19 వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.అయితే అమరావతి పట్టణ అభివృద్ధి కొరకు రూ.432.09 కోట్లు, ఏపీ గ్రామీణ రహదారుల కొరకు రూ. 500.99 కోట్లు, ఏపీలో పట్టణ తాగు,మురుగునీటి పారుదల నిర్వహణకు రూ.800 కోట్లు, ఏపీలో ప్రకృతి వ్యవసాయానికి 150.32 కోట్లు. ఏపీలో రహదారులు, వంతెనలు పునర్నిర్మానం కొరకు 350 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు.

**ఎడ్యుకేషనల్ కారిడార్లను ఏర్పాటు**
ప్రత్యేకంగా ఏడు హై స్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయడం ముంబై–పూణే, పూణే–హైదరాబాద్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, చెన్నై–బెంగళూరు, ఢిల్లీ–వారణాసి, వారణాసి–సిలిగురి. లకు ఇండస్ట్రియల్ కారిడార్లను పెంచడం జరుగుతుందన్నారు.ప్రత్యేకంగా ఎడ్యుకేషనల్ కారిడార్లను ఏర్పాటు చేయడం తద్వారా క్వాలిటీ ఎంప్లాయిస్ ని దేశానికి ఇవ్వాలన్న లక్ష్యం, ఐటీ, డేటా రంగానికి వికసిత్ భారత్ దిశగా బడ్జెట్లో కేటాయించడం జరిగిందన్నారు. ఎమ్ ఎస్ ఎమ్ ఈ కోసం ప్రత్యేకంగా రూ. 10 వేల కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవి రెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు శేషాంజనేయులు,చార్టెడ్ అకౌంటెడ్ మాజీ చైర్మెన్ లు డా.హరిచంద్ర , వెంకటస్వామి ,అశోక్ రెడ్డి,ఆంజనేయులు,లలిత్ కుమార్,యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్ రెడ్డి ,తేజేశ్వర్ రెడ్డి , ఇలియాజ్, అశోక్ ,రత్నమయ్య, దేవిరెడ్డి లక్ష్మీదేవి పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైల్వేకోడూరులో బండ్ల గణేష్ తిరుమల పాదయాత్ర.

### ఉప్పొంగిన ప్రజాదరణ.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 7 రిపబ్లిక్ న్యూస్**
రైల్వేకోడూరు నియోజకవర్గంలో సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు బండ్ల గణేష్ చేపట్టిన తిరుమల పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రైల్వేకోడూరు చేరుకున్న బండ్ల గణేష్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు.రైల్వేకోడూరు పట్టణం మొత్తం భక్తి, ఉత్సాహంతో కిటకిటలాడింది.బండ్ల గణేష్ తిరుమల పాదయాత్రకు ప్రజలు నీరాజనాలు పలుకుతూ, భాణసంచాలు పేలుస్తూ, పూల వర్షం కురిపించారు.
డప్పుల వాయిద్యాలు, కోలాటాల మధ్య పాదయాత్ర కొనసాగింది.రైల్వేకోడూరు చేరుకున్న బండ్ల గణేష్‌కు టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది.పాత బస్టాండ్‌కు చేరుకున్న బండ్ల గణేష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, తెలుగుదేశం



జెండాను ఊపుతూ ప్రజలకు అభివాదం చేశారు.
అనంతరం మీడియాతో మాట్లాడుతూ
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లిన సమయంలో, ఆయన ప్రాణాలతో బయటకు వస్తే నా గడప నుంచి నీ గడపకు నడుచుకుంటూ వచ్చి తిరుమలేశ్వరునికి మొక్కు చెల్లిస్తానని ముక్కుకున్నాను.
ఆ మొక్కుబడినే ఇప్పుడు నెరవేర్చుకుంటున్నాను. ఇప్పటివరకు 470 కిలోమీటర్లు పాదయాత్ర చేశాను.ఇది పూర్తిగా భక్తితో చేస్తున్న యాత్రే తప్ప రాజకీయ యాత్ర కాదు.గత నెల 12వ తేదీన చంద్రబాబు నాయుడుపై కేసు



కొట్టివేయడంతో, జనవరి 19న పాదయాత్ర కొనసాగిస్తున్నట్లు బండ్ల గణేష్ తెలిపారు.
రాజంపేట నుంచి తిరుమలకు మహానుభావుడు అన్నమయ్య నడిచిన దారిలో నడవడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు.రైల్వేకోడూరులో ప్రజలు చూపిన అభిమానం చూసి నా కళ్లలో నీళ్లు తిరిగాయి.రోమాలు నిక్కబడ్డాయి.నాపై ప్రేమ చూపిన ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా ఆడపడుచులకు పాదాభివందనం తెలిపారు.
భక్తి, భావోద్వేగాలు, ప్రజాదరణ మధ్య కొనసాగుతున్న బండ్ల గణేష్ తిరుమల పాదయాత్ర,
రైల్వేకోడూరు ప్రజల హృదయాలను దోచుకుంది.
కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యాంజలి 2.0 అవగాహన పై శిక్షణ తరగతులు





**చిప్పగిరి, జనవరి, 7,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి జెడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాల యందు విద్యాంజలి 2.0 ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం ఎంఈఓ సావిత్రమ్మ, ఎంఈఓ 2 ఎస్ఎండి ఫరూక్ ,ఆధ్వర్యంలో జరిగింది. ఎంఈఓ లు మాట్లాడుతూ పేద విద్యార్థుల్లో విజ్ఞానం వికాసాన్ని పెంపొందించేందుకు విద్యార్థులు 2.0 పథకం ప్రవేశపెట్టినట్లు వాలంటరీ వ్యవస్థను బలోపేతం చేయడము ఉద్దేశమని, ఈ పోర్టల్ ద్వారా పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల్లో దాతలు ద్వారా సమకూర్చుకోవచ్చని, ప్రధానోపాధ్యాయులు అందరికీ మధ్యాహ్నం భోజనం కల్పించబడినదని తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆర్పి ఏకాంబరం ఆర్పి గోపాల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాతి దూలం లాగుడు పోటీలు

# విజేతలకు బహుమతులు అందజేత

**గుత్తి ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని తొండపాడు గ్రామం వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. నాలుగు విభాగాలకు సంబంధించి పోటీలు జరిగాయి. గుంతకల్లు ఎమ్మెల్యే సోదరుడు శ్రీనివాసులు, ఆలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామి రెడ్డి యాదవ్ విజేతలకు బహుమతులు



అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారెడ్డి రంగస్వామి రెడ్డి మద్దిలేటి మాకం శ్రీకాంత్ మండల అధ్యక్షుడు లక్ష్మి రంగయ్య యంగన్నపల్లి సర్పంచ్ భరత్ ఎంపీటీసీ నారాయణస్వామి ఓంప్రకాష్ వెంకటేష్ శ్రీపురం సర్పంచ్ రామలింగమయ్య సర్పంచ్ చిదంబరం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## పాత్రికేయుడు పై

# టీడీపీ నాయకుడి దాడి

**బండి ఆత్మకూరు , ఫిబ్రవరి 7, (రిపబ్లిక్ న్యూస్ ):-**
మండలంలోని టుడే టీవీ జర్నలిస్టుగా పనిచేస్తున్న ఎం.ఆంజనేయులుపై సంత జూటూరు సహకార సంఘం ఆవరణలో శనివారం టిడిపి మండల అధ్యక్షుడు నాగ కృష్ణారెడ్డి దాడి చేయడం జరిగింది. పరమటూరు సహకార సంఘంలో ఎరువుల విక్రాయాలలో అవకతవకలు జరిగినాయి అని టుడే టీవీ జర్నలిస్ట్ ఆంజనేయులు శుక్రవారం టుడే టీవీ ఛానల్ లో ప్రసారం చేయడం




టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన టుడే టీవీ రిపోర్టర్ ఆంజనేయులు

జరిగింది. దీంతో శనివారం సహకార సంఘంలో జిల్లా సహకార సంఘం అధికారులు విచారణకు వచ్చారు. అయితే విచారణకు అధికారులు వచ్చారని రిపోర్టర్ ఆంజనేయులును కాల్ చేసి ఇక్కడికి రావాల్సిందిగా పిలిచారు. దీంతో జనం న్యూస్ రిపోర్టర్ సుబ్బయ్యతో కలిసి అక్కడికి వెళ్ళాడు. అప్పటికే కార్యక్రమాన్ని కవర్ చేయడానికి సహచర మరో ముగ్గురు జర్నలిస్టులు వచ్చారు.సహకార సంఘంలో అధ్యక్షులు కే .సాయిబాబా రెడ్డి సభ్యులు అందరూ కలిసి మాట్లాడుతుండగా టిడిపి మండల అధ్యక్షుడు ఉమ్మడి నాగ కృష్ణారెడ్డి ఆంజనేయులు మీడియా ప్రతినిధులను దుర్భాషలాడుతూ అతడు అతని అనుచరులు వెళ్లి టుడే టీవీ రిపోర్టర్ పై దాడి చేయడం జరిగింది. ఈ సంఘటనను మండలంలోని జర్నలిస్టులందరూ ముక్తకంఠంతో తీవ్రంగా ఖండిస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడి చేయడం అమానుషమైన చర్య అని పేర్కొన్నారు. ఎరువుల విక్రయాలలో అవకతల జరిగినాయని వార్తా ప్రసారం చేసినందుకు ఇలాంటి చర్యలకు పాల్పడటం దుర్మార్గమని మీడియా ప్రతినిధులు అన్నారు. ఒకవేళ తప్పుడు సమాచారం ప్రచారం చేసినట్లు మీకు అనిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప రిపోర్టర్ పై భౌతిక దాడులకు సరైంది కాదన్నారు.మీడియా సంస్థలకు చట్టపరంగా నోటీసులు అందించాలని సూచించారు.చట్టం చెబుతున్న ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడడం అమానుషమైన చర్యగా మండల జర్నలిస్టుల వివరణ ఇస్తున్నారు. కాగా టీడీపీ దాడిలో గాయపడిన నంద్యాల జనరల్ హాస్పిటల్లో యంఎల్ సి రిపోర్ట్ చేశారు.ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమని సమాజంలో ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేసే జర్నలిస్టులపై దాడిని ప్రజా సంఘాలు ప్రజాస్వామిక వాదులు రాజకీయ పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించాలని కోరుచున్నాము.

## జిఎం అవార్డు రైల్వే స్టేషన్ మాస్టర్ సురేష్ బాబు కు సన్మానం

**గుత్తి ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి జంక్షన్ రైల్వే స్టేషన్ మేనేజర్ సురేష్ బాబు సౌత్ సెంట్రల్ రైల్వే లో జనరల్ మేనేజర్ అవార్డు తీసుకున్న సందర్భంగా వారిని ఘనంగా సన్మానించిన గుత్తి, గుత్తి ఆర్ఎస్ ప్రజలు. సన్మానించిన వారిలో గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ సభ్యులు విజయభాస్కర్, గుత్తి ఆర్ఎస్ లోని ప్రసిద్ధ శ్రీ గౌతమేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ శేఖర్ రెడ్డి, వారిని శాలువాతో, పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జంక్షన్



అభివృద్ధి కమిటీ సభ్యులు విజయభాస్కర్ మాట్లాడుతు సురేష్ లాంటి అధికారులు అరుదుగా ఉంటారని, మృధుస్వభావం, సహా ఉద్యోగుల పట్ల అంకింత భావం, వారితో ఆప్యాయత పలకరింపు, సమయస్ఫూర్తితో, జంక్షన్ లో ఉన్న అన్ని శాఖల రైల్వే కార్మికులను కలుపుకొని జంక్షన్ కు ప్రతి రోజు దాదాపుగా వందకు పైగా రైళ్లు రావడం వాటిని సమన్వయ పరుస్తు ఉద్యోగుల సమయాలు, వారి విధుల పరివేక్షణ వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి గుత్తి జంక్షన్ అభివృద్ధి లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని దక్షిణ మధ్య రైల్వే జిఎమ్ అవార్డును తన సొంతం చేసున్న గుత్తి రైల్వే జంక్షన్ మేనేజర్ సురేష్ రైల్వే ఉద్యోగులకు, ఇప్పుడున్న యువతరానికి ఆదర్శప్రాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి రైల్వే ఉద్యోగులు ఏ ఎస్ ఎం. సుదీర్, ప్రసాద్ రెడ్డి, రామాంజనేయులు, గోపాల్ నాయక్, విశ్రాంత రైల్వే ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ గద్దల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్ — ప్రతి అక్షరం ప్రజల కోసం — RNI No./2023/87888
ఆదివారం 8 ఫిబ్రవరి 2026

# రాజకీయ లబ్ధి కోసం తిరుపతి లడ్డు పై భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్న టిడిపి

## తిరుమల లడ్డు పై వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి



**కల్లూరు ప్రతినిధి, ఫిబ్రవరి 7, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
శనివారం రోజుపాణ్యంమాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిమీడియాతో మాట్లాడుతూ. 1. తిరుమల ప్రసాదం లడ్డూ తయారీకి వాడే నేయిలో జంతువుల కొవ్వు, పందికొవ్వు, గొడ్డుమాంసం కలిసిందని తప్పుడు ఆరోపణలు చేసి, తిరుమల వెంకటేశ్వర స్వామి ప్రతిష్టను, కోట్లాదిమంది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తన దుర్మార్గపు ఆలోచనలను ఇంకా విడిచిపెట్టడంలేదు. రాజకీయాలకు దేవుడ్ని వాడుకోవాలని దుర్మార్గపు ఆలోచనలను కొనసాగిస్తూనే ఉన్నాడు. 2. లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వుగాని, గొడ్డు మాంసం కొవ్వుగాని, పందికొవ్వుగాని లేదని దేశంలోనే ప్రతిష్టాత్మక సంస్థలైన చీణ=×, చీణణదీ ల్యాబులు చెప్పడంతో ప్రజలు, కోట్లమంది వెంకటేశ్వరస్వామి భక్తులు చీదరించుకున్నారు. 3. ప్రజల దృష్టిలో పూర్తిగా కిందకు పడిపోయిన చంద్రబాబు, మళ్లీ, ఏదోరకంగా తన అబద్ధాలు నిజాలని చెప్పడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాడు. దీంట్లో భాగంగా ఇంకా ఎన్ని కుట్రలు చేయాలో అన్నీ చేస్తున్నాడు. 4. నిజాలు అంగీకరించి చంద్రబాబు ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, సుప్రీంకోర్టు ఆదేశాలతో జరిగిన దర్యాప్తుమీదా, చీణణదీ, చీణ=× సంస్థల మీద దాడిచేయడం, ప్రశ్నిస్తున్న వైయస్సార్సీపీ నాయకులమీద దాడులు చేసి, ఇళ్లను తగలబెడుతున్నాడు. 5. ప్రజల దృష్టిలో చులకనైపోయిన చంద్రబాబును, ప్రజాగ్రహం నుంచి రక్షించడానికే మొన్న కూటమి పార్టీ నాయకుల సమావేశం జరిగింది. పచ్చి అబద్దాలు మాట్లాడి, కోట్లాది మంది భక్తులు నమ్మకాన్ని దెబ్బతీసిన చంద్రబాబు క్షమాపణ చెప్పకుండా అధికారబలంతో, తనకున్న ఎల్లోమీడియా బలంతో ఎదురుదాడి చేసి, ప్రజలకు క్షమాపణ చెప్పకుండా తప్పించుకోవాలని చూస్తున్నాడు. టిటిడి లడ్డూ ఒక వస్తువు కాదు అది విశ్వాసం,6. తిరుమల లడ్డూ అన్నది కేవలం ప్రసాదం మాత్రమే కాదు. దాన్ని ఎంతో భక్తితో, పవిత్రతో చూస్తాం. కోట్లాది భక్తుల భావోద్వేగాలతో ముడిపడి ఉంటుంది. అలాంటి లడ్డూను ఉద్దేశించి జంతువుల కొరు అని, పశువుల కొవ్వు అని, పందికొవ్వు అని ఒక ముఖ్య బ స్థానంలో ఉండికూడా అపవిత్రపు మాటలు చెప్పి చెప్పి, కోట్ల భక్తుల విశ్వాసాలను దెబ్బతీసింది ముఖ్యమంత్రిచంద్రబాబు కాదా, ఇప్పుడు అది లేదని తేలిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పవన్కళ్యాణ్ క్షమాపణ చెప్పరా,7. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వ ఉందని ఏడాదిన్నరగా ప్రచారం చేసిన ఈ చంద్రబాబు నాయుడు ఇప్పుడు అది కాదు, వేరేవి ఉన్నాయి అంటూ ఇప్పుడు మాట్లాడి అసలు ఆరోపణలనుంచి పక్కకు వెళ్లిపోయి, క్షమాపణ చెప్పకుండా తప్పించుకుంటున్నాడు. 8. భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేముందు, సున్నితమైన సమస్యపై తీవ్ర ఆరోపణలు చేసేముందు నిర్ధారించుకోవాలన్న ఇంగిత జ్ఞానం చూపలేదు. ఇది చంద్రబాబు తప్పుకదా? అపరాధం కాదా,9. ఇప్పుడు కూడా బాత్రూమ్స్లు క్లీన్చేసే యాసిడ్స్ వాడారంటూ మళ్లీ దేవుడంటే భయం, భక్తి లేకుండా మాట్లాడ్డం మరొక పాపం. 10. విశ్వాసం రాజకీయ సాధనంగా మారకూడదు. ఏ రాజకీయ పార్టీకి అయినా. అధికారంలో ఉన్నా. ప్రతిపక్షంలో ఉన్నా టిటిడి లడ్డూను లేదా శ్రీ వేంకటేశ్వర స్వామి పేరును రాజకీయ లాభాల కోసం వాడే హక్కు లేదు. దేవుడితో రాజకీయాలు ఆడటం సరికాదు. 11. హిందూ ధర్మ పరిరక్షణ పేరుతో మాట్లాడే చంద్రబాబు, పవన్ కళ్యాణ్, భక్తుల మనోభావాలను గాయపరిచే అబద్ధాలకు ఎందుకు మద్దతిచ్చారు,12. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడువ్యాఖ్యల వల్ల దేశవ్యాప్తంగా తిరుమల ప్రతిష్ట దెబ్బతింది.దీనికి బాధ్యత ఎవరిది,13. రాజకీయ లాభం కోసం దేవుడిని, ప్రసాదాన్ని వాడుకుని దేవుడ్ని, తిరుమల ఆలయాన్ని ఇవాళ అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. 14. తాను చేసిన తప్పుకు క్షమాపణ చెప్పి, లెంపలు వేసుకుని, పశ్చాత్తాపం వ్యక్తం చేయకుండా ఇంకా మభ్యపెట్టి, వక్రీకరణలు చేసి, అబద్ధాలు చెప్పి. ప్రజల ఆగ్రహం నుంచి తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడలు వేసి, మరింత రభస చేయడం క్షమించరాని నేరం. 15. లడ్డూ ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవాలన్న చంద్రబాబు దుర్బుద్ధితోనే 2024 సెప్టెంబరులో మాట్లాడారన్నది ముమ్మాటికీ నిజం. ఆరోజు ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు, మాట్లాడిన మాటలకు, ఇవాళ రాష్ట్ర ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడుతో కలిసి కూర్చుని మీరు మాట్లాడిన మాటలకు ఏమైనా పొంతన ఉందా,ఆరోజు ఏం చెప్పారు. ఇవాళ ఏం. మాట్లాడుతున్నారు. 16. మరి జంతువుల కొవ్వుగాని, పందికొవ్వుగాని, గొడ్డు మాంసం కొవ్వుగాని లేదని తేల్చారు కదా? అదిపోయి.. ఇప్పుడు పామాయిల్ అంటున్నారు. అదికూడా జరిగింది నీ హయాంలోనే కదా చంద్రబాబూ. 17. తిప్పి పంపిన ఆ నాలుగు ట్యాంకర్లు కూడా మళ్లీ చంద్రబాబుగారి హయాంలోనే టీటీడీకి వెళ్లాయన్నది నిజం. సీబీఐ ఇవన్నీ చెప్పింది. మరి వాటిని ఎవరిమీద రుద్దుతారు,18. నిష్పక్షపాతమైన విచారణకోసం మేం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తప్పులు చేసినవారు ఎవరైనా గి. సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారా,19. చివరకు సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన సిట్లో లో ఇద్దరు సీబీఐ అధికారులైతే, అందులో మరో ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన అధికారులు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయంలోనే, సీబీఐ సిట్ ఏర్పాటైంది చంద్రబాబు నాయుడు హయాంలోనే, నెయ్యి పరీక్షలకోసం శాంపిళ్లు తీసుకున్నది. చంద్రబాబు నాయుడు హయాంలోని సప్లై అయిన ట్యాంకర్ల నుంచే, ఇవన్నీ వాస్తవాలు కావా,20. మొత్తం వీటన్నింటిమీదా అన్నికోణాల్లోనూ సీబీఐ విచారించింది. జంతువుల కొవ్వు లేదు. పందికొవ్వు లేదు, గొడ్డుమాంసం కొవ్వులేదని చాలా క్లియర్చెప్పి, క్లీన్ చిట్ ఇచ్చింది. మరెందుకు చంద్రబాబు ఇంకా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడు. రాద్ధాంతం చేస్తున్నాడు. 21. సీబీఐ సిట్లో ఉన్న చంద్రబాబు నాయుడుకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు కూడా ఉన్నారు. వాళ్లుకూడా దర్యాప్తులో భాగస్వాములే కదా,22. సీబీఐ సిట్ తన దర్యాప్తులో భాగంగా విచారించిన అధికారులో అంతా.. ఈవో, జేఈవో అందరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పెట్టిన 2 4/7 వాళ్లందరన్నీ విచారించిన తర్వాతనే కదా.. సీబీఐ ఛార్జిషీటు వేసింది.అన్ని రకాల రిపోర్టులను చూసిన తర్వాతే ఛార్జిషీటు వేశారు కదా, మరి ఎందుకు ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు ఇంకా కుట్రలుమీద కుట్రలు చేస్తున్నాడు. 23. మీ కూటమిలోని పార్టీల వాళ్లతో కలిసి కూర్చుని, చివరకు మీరు చేస్తున్నది ఏమిటి? ఒకరేమో మానిమల్ ఫ్యాట్ అంటారు? ఇంకొకరేమో వెజిటబుల్ ఆయిల్ అంటాడు? మరొకడు ఇంకోటి అంటాడు. 24. అసలు రాష్ట్రంలో దేవాలయాలను దెబ్బతీసింది ఎవరు? చంద్రబాబు హయాంలో ఆలయాల్లో జరిగిన ఘోరాలు, ఘటనలు ఎన్ని. ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్నిసార్లు అపవిత్ర పనులు జరిగాయి. ద్రాక్షా రామంలో శివలింగాన్ని ఛేదనం చేసింది మీ హయాంలో కాదా? విజయవాడలో గుళ్లను కూల్చి మీరు కాదా? తిరుమలలో ఎన్ని ఘటనలు జరుగుతున్నాయి? సింహాచలం ప్రసాదంలో నత్త ఉందని భక్తులు చెప్తే వారిని బెదరగొట్టారు,మొన్న అన్నవరంలో ప్రసాదంమీద ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయి. 25. తిరుమల ప్రసాదం అంటే. భక్తితో దాన్ని మొక్కి తినే పరిస్థితి నుంచి ఇవాల తిరుమల ప్రసాదం అంటే.. సందేహించే స్థాయికి చంద్రబాబుగారు తన తప్పుడు ప్రచారాలతో తీసుకెళ్లారు. ఇంతకన్నా ఘోరం ఏముంటుంది,26. పరిపాలనలో మీరు ఘోరంగా విఫలమయ్యారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్రంగా ఫెయిల్ అయ్యారు. అన్నివర్గాల వారినీ మోసం చేశారు. అన్ని రంగాలనూ నాశనం చేశారు. 27. వీటన్నింటినీ డైవర్ట్ చేసేందుకు భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారు. దేవుడ్ని రాజకీయాలకు వాడుకుంటున్నారు. అంత దారుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగజారిపోయారు. అబద్ధాలను నిజం చేయడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. 28. అయోధ్యకు లక్ష లడ్డూలు కల్తీ నేయితో తయారు చేసి పంపారని ఇప్పటికీ చెప్తున్నారు. ఈ అబద్ధాన్ని పవన్ కళ్యాణ్ చెప్పడం. ఇదే తొలిసారి కాదు. అనేక సార్లు మాట్లాడుతూనే ఉన్నాడు. వాస్తవం ఏంటంటే.. టీటీడీ బోర్డు మెంబర్ సౌబర్ గోరా, బీజేపీ వాళ్లకి అత్యంత సన్నిహితుడు, ఆయన, మరో మాజీ మెంబర్ రామేశ్వర్రావు కలిసి దాదాపు సంప్రదాయ పద్ధతిలో తయారుచేసిన నెయ్యిని డొనేట్చేసి ఇచ్చారు. దాన్ని వక్రీకరించి ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడుఅయోధ్య రాముడి గురించే పచ్చి అబద్ధాలు చెప్తున్నాడు. ఏ ధర్మం చెప్పింది ఇలా అబద్ధాలు చెప్పాలని. 29. రోజుకో స్టేట్ మెంట్ ఇచ్చి, అసలు తన పార్టీ వాళ్లనే పవన్ కళ్యాన్ అయోమయంలోకి నెట్టేస్తున్నాడు. ఒకసారి దేవుడికి పెట్టే దీపంతో హారతి వెలిగించానంటావ్, ఇంకోసారి కమ్యూనిస్టుని అంటావు, నాకు భక్తి లేదంటావ్ ఒకసారి, సనాతిని అని మరోసారి అంటావ్. ఏదో ఒక స్టేట్మెంట్కి కట్టుబడి ఉండు పవన్ కళ్యాణ్. 30. టీటీడీని ప్రక్షాళన చేయడానికే శ్యామలరావును తీసుకొచ్చానని చంద్రబాబు అంటున్నారు. మరి శ్యామలరావును ఎందుకు బదిలీచేశారు, రెండు సార్లు ఆయనే టీటీడీ ఈవోగా పెట్టుకున్న సింఘాల్ను ఎందుకు బదిలీచేశారు? 31. చంద్రబాబుగారూ ఇప్పటికైనా మీ నీచ ప్రచారాలు, అబద్దాలను కట్టిపెట్టడండి. భక్తుల మనోభావాలకు గౌరవం ఇవ్వండి. మీరుచేసి తప్పులను ఒప్పుకోండి. లేని తప్పుడు ప్రచారాలు చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీయకండి. 32. చంద్రబాబు కచ్చితంగా ప్రజలకు, శ్రీవారి భక్తులకు క్షమాపణ చెప్పాలి అని కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి, రేణుక, మరియు వైఎస్ఆర్సిపి కార్పొరేటర్లు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

---

# వైసిపి ప్రభుత్వంలో తడకనపల్లె గ్రామంలో ఇళ్ల పట్టాలను మంజూరు చేసిన వైసిపి







**కల్లూరు ప్రతినిధి, ఫిబ్రవరి 7, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
శనివారం రోజుకల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో సర్వే నెంబర్, 86 లో ఇల్లు లేనినిరుపేదలకు ఇచ్చినటువంటి ఇళ్ల పట్టాలను కొంతమంది అక్రమంగా ఆక్రమించడమే కాకుండా జగనన్న లేఅవుట్లను తొలగించి, అక్రమంగా అక్రమణాలు చేస్తుంటే పట్టి పట్టనట్టుగా రెవెన్యూ అధికారులు ఎలా చూస్తూ ఉరుకుంటున్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రశ్నించారు.దీనిపై గతంలోనూ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు.. ఇలాంటివి పునరావృతం అయితే సహించేది లేదని ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలను యధావిధిగా కొనసాగించాలని లేనిపక్షంలో వారికి సరైన గుణపాఠం చెప్తామని వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి హెచ్చరించారు.సర్వే నంబర్ 337లో లెవెలింగ్ అని తడకనపల్లె గ్రామంలో అనేక చోట్ల గ్రావెల్ తవ్వకాలు భూఆక్రమణలు జరుగుతున్నాయని గతంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని వారికి తెలిపారు.అర్హులైన వారికి గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు

---

## దేశవ్యాప్త సమ్మెను విజయవం తం చేయండి : సీఐటీయూ



**గుత్తి ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**గుత్తి పట్టణంలో పౌరసరఫరాల స్టాక్ పాయింట్ వద్ద దేశవ్యాప్త సమ్మెను వి జయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ర మేష్ పిలుపు నిచ్చారు.గుత్తిలోని పౌరసరఫరాల స్టాక్ పాయింట్ వద్ద శనివారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యల పరిష్కారం కోసమే ఈ నెల 12న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు.ఈ నిరసనలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

---

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు

### జిల్లా ఎస్పీని ఆహ్వానించిన శ్రీశైల దేవస్థాన అధికారులు





**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 7, (రిపబ్లిక్ న్యూస్):**
శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 8 నుండి 18 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. శనివారం ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు దేవస్థానం అధికారులు, అర్చకస్వాములు నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ కి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికను అందజేసి ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమములో వేదాశీర్వచనంతో వారికి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి జి.స్వాములు, సహాయ ప్రజాసంబంధాల అధికారి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

---

# వైభవంగా రజతోత్సవ సంబరాలు

**పైలాన్ కు భూమి పూజ**
**అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
**మెడికల్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం**
**పాల్గొన్న మంత్రి సత్యకుమార్**
**సిబ్బంది కొరతను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే**



**అనంతపురం వైద్యం, ఫిబ్రవరి 07,(రిపబ్లిక్ న్యూస్):**
నగరంలోని మెడికల్ కళాశాలలో వైభవంగా రజతోత్సవ సంబరాలు నిర్వహించారు. 25 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు గారి కృషితోనే మెడికల్ కళాశాల ఏర్పాటైందని .. ఆ తర్వాత ఆయన హయాంలోనే పీజీ సీట్లు కూడా వచ్చాయని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. శనివారం జరిగిన మెడికల్ కళాశాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో ఆయన మంత్రి సత్యకుమార్ గారితో కలిసి పాల్గొన్నారు. మంత్రితో పాటు ఎమ్మెల్యేకి కళాశాల అధ్యాపకులు, వైద్యులు ఘన స్వాగతం పలికారు. సిల్వర్ జూబ్లీ పైలాన్ కు మంత్రి సత్యకుమార్ , ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భూమి పూజ చేశారు.

**ఎంతో మంది అధ్యాపకుల కృషి ఉంది**
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాకు మెడికల్ కళాశాల తీసుకొచ్చింది.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారే అన్నారు. ఈ క్యాంపస్ సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా ఉండటం వలన ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఆ తర్వాత 2014లో పీజీ సీట్లు కూడా వచ్చాయన్నారు. 25ఏళ్ల పాటు దినదినాభివృద్ధి చెందుతూ అనేక అవార్డులు సాధించే విధంగా కళాశాల మారిందంటే.. ఇక్కడ పని చేసే ఎంతో మంది అధ్యాపకుల కృషి ఉందన్నారు.

**13 వందల పడకల ఆసుపత్రిగా మార్చాలి**
జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కూడా టీడీపీ హయాంలోనే వచ్చిందన్నారు. ఇది పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందించడం నిజంగా ఒక వరం అన్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వాసుపత్రిలో రోగుల సంఖ్య భారీగా పెరిగిందని.. 3వేల మంది అవుట్ పేషేంట్లు, 13వందల మంది ఇన్ పేషెంట్లు ఉన్నారన్నారు. అందుకే దీనిని 13వందల పడకల ఆసుపత్రిగా మార్చాలని కోరామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మెడికల్ కళాశాలలో అధ్యాపకులు ఇతర బృందం 441మంది ఉండాల్సి ఉండగా.. 308మంది మాత్రమే ఉన్నారని.. ఇంకా 133మంది సిబ్బంది కొరత ఉందన్నారు. వీటిని భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే నిర్మాణం పూర్తి చేసుకున్న మహిళా హాస్టల్ ను ప్రారంభించడంతో పాటు నూతన ల్యాబ్ ను ఏర్పాటు చేయాలని మంత్రి సత్యకుమార్ గారిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు.

# భారత రాజ్యాంగమే ఈ దేశ సమధర్మ గ్రంధం.

## బహుజన సేన వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ చందు

కుప్పం ఫిబ్రవరి (రిపబ్లిక్ న్యూస్) 7
ఎస్సీ,ఎస్టీ దాడుల పట్ల ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి ముద్దాయిలకు శిక్షలు పడేలా చూడాలి, ఎస్సీ ఎస్టీ పథకాలను పునరుద్ధించాలి.
బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేసి రాజ్యాంగ చట్టబద్ధత కల్పించాలి.
ముస్లిం క్రిస్టియన్ దాడుల పట్ల ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేసి, రాజ్యాంగబద్ధ చట్టబద్ధత కల్పించాలి.
జనం మనది బలం మనది ఏకమైతే రాజ్యం మనది.
బహుజన సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ చందు.







ఈ దేశంలో ఈ రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం క్రైస్తవులు పట్ల జరుగుతున్న అన్ని రకాల దాడుల పట్ల రాజ్యాంగబద్ధ తిరుగుబాటు తప్పదని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీ చందు గారు హెచ్చరించారు.

ఈ రోజున కుప్పం పట్టణంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన బహుజనుల రాజ్యాంగ హక్కుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఈయన ప్రసంగించారు. మీరు మాట్లాడుతూ... దేశంలో మత విద్వేషం పెరిగిపోతుందని ముస్లింల పైన క్రైస్తవుల పైన అంబేద్కర్ స్త్రీల పైన కమ్యూనిస్టుల పైన బిజెపి ఆర్ఎస్ఎస్ నేతలు తీవ్రమైన దాడులకు పాల్పడుతున్నారని వీరు ఆరోపించారు. రాజకీయ నాయకులు విద్వేషపూరిత ప్రసంగాల ద్వారా ముస్లింల పైన క్రిస్టియన్లు పైన అత్యంత తిరుగుబాటు విద్వేషాలు రెచ్చగొట్టి దేశంలో మతపరమైన శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని వీరు ఆరోపణ చేశారు. భారతదేశ రాజ్యాంగ లౌకికత్వ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా బిజెపి,ఆర్ఎస్ఎస్,బజరంగ్ దళ్ వ్యవహరిస్తున్నాయని వీరు దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీల పరిస్థితి మరింత ఘోరంగా తయారైందని ప్రభుత్వాలు మారుతున్న దాడులు హత్యలు వివక్ష కొనసాగుతూనే ఉన్నాయని, ఎస్సీ ఎస్టీ దాడుల పట్ల ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, కర్నూల్ లో జరిగిన కే ఎన్ రమేష్ హత్యాకాండ కేసు గాని రాష్ట్రంలో జరుగుతున్న దాడులు గాని సత్వర న్యాయం జరగలేక నీరుగారి పోతున్నాయని వీరు ఆవేదన చెందారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు ప్రత్యేకంగా చూడడానికి స్పెషల్ డిఎస్పీ లను రద్దు చేయడం, దీనిపైన పెద్ద ఎత్తున పోరాటం రాష్ట్రవ్యాప్తంగా బహుజనసేన చేసి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ఇంతవరకు స్పెషల్ డిఎస్పీలను ఏర్పాటు చేయకపోవడం విచారకరమని వీ రు ఆవేదన చెందారు.

ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులు చదువుకుంటున్న హాస్టల్ పరిస్థితి మరింత ఘోరంగా ఉందని, వీరి కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి మిస్ చార్జీలు పెంచి పౌష్టికాహారాన్ని అందించాలని ఈ కార్యక్రమం ద్వారా మీరు డిమాండ్ చేశారు. కళాశాలలో జరుగుతున్న కుల వివక్షకు కేంద్ర ప్రభుత్వం యుజిసి బిల్లును తీసుకొచ్చిందని ఈ బిల్లును బహుజనసేన స్వాగతిస్తుందని.. ఈ బిల్లు అమలులో చట్టపరమైన దోషాలు లేకుండా చూసుకోవాలని వీరు కోరారు. మోహన్ బాబు యూనివర్సిటీలో విద్యార్థి నాయకుల కిడ్నాప్తంతాన్ని గుర్తు చేస్తూ కళాశాల యాజమాన్యం పైన బౌన్సర్లు పైన చట్టపరమైన శిక్షలు పడేలా పోలీస్ డిపార్ట్మెంట్ వ్యవహరించాలని ఇందుకు కారణమైన మోహన్ బాబు మంచు విష్ణు గారిని కూడా అరెస్టు చేయాలని వీరు పోలీస్ డిపార్ట్మెంట్ ని కోరారు.

ప్రభుత్వాలు ఇతర వర్గాలు చేస్తున్న దాడుల పట్ల ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం క్రైస్తవ ప్రజలు ఓపిక నశించిపోయి తిరుగుబాటు చేయడానికి సిద్ధమయ్యారని

అందుకు నాంది కుప్పం నుంచే మొదలవుతుందని ఈ ప్రమాదం జరగకుండా ప్రభుత్వాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వీరు హెచ్చరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు కుప్పం నడిబొడ్డున ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి తదుపరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లీం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జాఫర్ అలీ,హుస్సేన్,మహ్మద్ సలీమ్,క్రిస్టియన్ ఐక్యవేదిక ణూా జాన్,అరుణాచలం,ూు నాయకులు శేఖర్,బహుజన సేన నాయకులు సతీష్, గోవిందప్ప, శివ,వేణు, కుమార్,హరికృష్ణ, భాను ప్రకాష్,వెంకటేష్,సుధాకర్,శశి మరియు ఎస్సీ ఎస్టీ బీసీ క్రిస్టియన్ ముస్లిం సోదరులతో సభా ప్రాంగణం నిండిపోయి భారత రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ మారుమరోగింది ఈ కార్యక్రమంలోఎస్సీ, ఎస్టీ బీసీ ముస్లిం క్రైస్తవ సమాజం నుంచి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోరు అందుకున్న ఎన్నికల ప్రచారం

## 14వ వార్డు బి ఆర్ ఎస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

**ఆందోల్ ఫిబ్రవరి 7 ( రిపబ్లిక్ న్యూస్)**



ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో బి ఆర్ ఎస్ 14వ వార్డ్ అభ్యర్థి పల్లె నాగజ్యోతి వెంకటరమణ ఇంటింటి ప్రచారంలో ప్రజల అశేష స్పందనతో ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రజలు బ్రహ్మరథం పడతా ఉన్నారు ఈ సందర్భంగా వారికి మద్దతుగా వార్డులో ప్రచారానికి ఇన్చార్జిగా వచ్చిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు స్థానిక డాకూరు మాజీ సర్పంచ్ శంకరయ్య మాట్లాడుతూ ప్రజలు గత ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలు నేరుగా ఇంటింటికే చేరేలా చర్యలు తీసుకున్నారు అందులో భాగంగానే రైతులకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు ఎవరైనా రైతు అకాల మరణం చెందుతే నిజంగా ఎలాంటి పైరవీలు లేకుండా ఇంటికే నేరుగా ఐదు లక్షల చెక్కు వచ్చే విధంగా రైతు బీమా పథకాన్ని తీసుకువచ్చారు ఆడబిడ్డలు ప్రభుత్వ ఆసుపత్రికి కాన్పు పోవాలంటే డబ్బులు లేని నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రికి పోవాలంటే భయపడే పరిస్థితిలో ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం చెందేలా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్ది నేరుగా తల్లిని పుట్టిన పిల్లను బాబును నేరుగా ప్రభుత్వ వాహనంలోనే ఇంటికాడ దింపి పోయే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది మిషన్ కాకతీయ ద్వారా అనేక చెరువులు నింపి రైతన్నలకు బాసటగా నిలిచారు మిషన్ భగీరథ తోని ప్రతి మహిళను ఇంటి వద్దకే మంచినీటి సౌకర్యాన్ని ఇచ్చిన ఘనత కేసిఆర్ కి దక్కుతుందని ప్రజలు మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమే రావాలి అనేక సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ఆయన మళ్లీ అధికారంలోకి వస్తేనే సాధ్యమైతాయని ప్రజలు నేరుగా అడుగుతున్నారు అదే వార్డ్ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేస్తూ మీ 14వ వార్డు బి ఆర్ ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి పల్లె నాగజ్యోతి వెంకటరమణను భారీ మెజారిటీతో గెలిపించి మన వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుకుందామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వెంకటరమణ నాగజ్యోతి కాలనీవాసులు బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# 8 వార్డ్ లో జోరు అందుకున్న ఎన్నికల ప్రచారం.

## బండల్ల సంతోష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి



**ఆందోల్ ఫిబ్రవరి 7 ( రిపబ్లిక్ న్యూస్)**అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 8వ వార్డ్ కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి బండల్ల సంతోష్ కుమార్ గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మనది చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు తెలియజేశాడు. అభివృద్ధి అంటే మంత్రి దామోదర్ రాజనర్సింహ చేపట్టినటువంటి ఎన్నో మన ఆందోల్ నియోజకవర్గంలో కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. మన వార్డ్ అభివృద్ధి కావాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పురుషులు మహిళలు పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ముక్కా వరలక్ష్మి

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 7 రిపబ్లిక్ న్యూస్.**

ఓబులవారిపల్లె మండలం గాదేల పంచాయితీ అరుంధతి వరకు చెందిన అందే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు 83,859రూపాయల చెక్కును కూడా చైర్మన్, రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద్ రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి శనివారం పంపిణీ చేశారు అదే గ్రామానికి చెందిన ఇరువురి నాగేంద్ర కు 26,187 రూపాయల చెక్కును, వంగినేని ఆంజనేయులుకు 18 వేల రూపాయలు చెక్కును, వంగల కోటాలయ్యకు 22,056 రూపాయల చెక్కును అందజేశారు,అనంతరం ఓబులవారిపల్లె మండలం ముక్కు వారి పల్లె గ్రామం ముక్కా భారతమ్మకు లక్ష ఇరవై వేల రూపాయల చెక్కును, ముక్కా వారి పల్లి పంచాయతీ తుర్కపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ జాబర్ కు 83 వేల 984 రూపాయలు, అదే గ్రామానికి చెందిన సయ్యద్ రఫీ మున్ని షాపు 84286 రూపాయల చెక్కును, అందజేశారు, అనంతరం ఓబులవారిపల్లి మండలం ముక్కు వారి పల్లి పంచాయతీ సంజీవపురం గ్రామానికి చెందిన చింత మహాదేవరెడ్డికి 2 21 వేల 78 రూపాయల చెక్కును, చిన్న ఊరంపాడు కు చెందిన చాపల మడుగు సుబ్బరత్నమ్మకు 81 వేల రూపాయల చెక్కును, కోటపాటి లక్ష్మీదేవికి 33,795 రూపాయలు చెక్కును, చిన్నఓరంపాడు పంచాయతీ అయ్యల రాజు పల్లె కు చెందిన చింటూ సుధాదేవికి 1,79 వేల 420 రూపాయల చెక్కును, అదే గ్రామానికి చెందిన కుంపటి నాగిరెడ్డికి 43727 రూపాయలు





చెక్కును, అయ్యల రాజు పల్లె వడ్డేపల్లి కు చెందిన కోటకొండ పెంచలమ్మకు 52,654 రూపాయల చెక్కును, మండల కేంద్రం ఓబులవారిపల్లెలో నూక వెంకట నరసమ్మకు 69,65 రూపాయల చెక్కును, తోట వెంకటరత్నమ్మకు 1,14,144రూపాయలు చెక్కును, తోట మౌనికకు లక్ష 11725 చెక్కును, బలిజపల్లె గ్రామానికి చెందిన కన్నె శెట్టి ప్రియాంకకు రెండు లక్షల 96,61 చెక్కును, వై కోట పంచాయతీ కొత్త పిల్ల పార్వతి చిన్నారి తరపున కుటుంబ సభ్యుడు విజయ్ కుమార్ కు నాలుగు లక్షల 70466 రూపాయల చెక్కును, వై కోట గ్రామానికి చెందిన షేక్ మదర్సా మస్తాన్ కు 1,64 133 చెక్కును ఆమె పంపిణీ చేయడం జరిగినది ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలైన ప్రజలు అనారోగ్యాలకు గురై కార్పొరేటర్ ఆసుపత్రుల్లో చికిత్స కొరకు ఆర్థిక స్తోమత లేక బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా సహాయపడుతున్నదని ఇలాంటి వ్యక్తులు నియోజకవర్గంలో ఎక్కడున్నా ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలకు సూచించారు ఈ పథకం ద్వారా ఎంతోమంది లబ్ది పొందారని ఆమె అన్నారు కోటి మీ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందని ఎవరు అధైర్య పడవద్దని ఆమె వారికి భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, యువ నాయకుడుముక్కా సాయి వికాస్ రెడ్డి, సీనియర్ నాయకులు, మల్లికార్జున రెడ్డి, గజేంద్రనాయుడు,వాసుదేవ రెడ్డి,జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర,ఒబిలి ప్రసాద్ రెడ్డి,కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రాజనాల బండ పై విశేష పూజలు

**చౌడేపల్లి ప్రతినిధి ఫిబ్రవరి 07 రిపబ్లిక్ న్యూస్**



రాష్ట్రంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన మండలంలోని రాజనాల బండ పై శనివారం విశేష పూజలు జరిగాయి, టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే ప్రధానార్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ నరసింహ స్వామి క్షేత్రపాలకుడు ప్రసన్న ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొందరు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదాలు వేసుకొని వెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు టీటీడీ సిబ్బంది సేవలు అందించారు.

# బనగానపల్లెలో దొంగల హల్‌చల్ కోటి రూపాయల బంగారం, వెండి అపహరణ



**బనగానపల్లి ఫిబ్రవరి 7 రిపబ్లిక్ (న్యూస్)**
నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీ శ్రీనివాస జువెలరీ షాప్‌లో అర్ధరాత్రి దుండగులు భారీ దొంగతనానికి పాల్పడ్డారు.స్థానికుల సమాచారం మేరకు, జువెలరీ షాప్‌కు ఉన్న షెల్టర్ తాళాలను గ్యాస్ వెల్డింగ్ ద్వారా తొలగించి, సుమారు రూ. కోటి విలువైన 500 గ్రాముల బంగారం, 12 కిలోల వెండిని దుండగులు అపహరించినట్లు తెలుస్తోంది.ఈ ఘటనపై జువెలరీ షాప్ యజమాని గోవిందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.బనగానపల్లి పట్టణంలో బారి దొంగతనశీ జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# అయ్యవారిపల్లి స్మశానా భూమిపై వైఎస్ఆర్ సీపీకి బత్తిన గంగయ్య యాదవ్ బహిరంగ సవాల్.

**ఓబులవారిపల్లి ఫిబ్రవరి 7 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరు మండలం అయ్యవారిపల్లి స్మశాన భూమి ఆక్రమణ ఆరోపణలపై వైఎస్ఆర్సిపి పార్టీ కోడూరు నాయకులకు, రైల్వే కోడూరు జనసేన పార్టీ సీనియర్ నాయకుడు బత్తిన గంగయ్య యాదవ్ బహిరంగ సవాల్ చేశారు, అయ్యవారిపల్లి హరిజనవాడ స్మశాన వాటిక భూమిని అమ్మినది వైఎస్ఆర్సిపి పార్టీ వ్యక్తి అని ఆ భూమిని కొన్నది వైఎస్ఆర్సిపి పార్టీ వ్యక్తి అని బోర్లు వేసి అనుభవిస్తున్నది వైఎస్ఆర్సిపి పార్టీ వాళ్లేనని దానికి నాకు ఎలాంటి సంబంధం లేదని ఈ సందర్భంగా ఆయన అన్నారు కావాలని నాపై బురద చల్లాలని కొందరు వైఎస్ఆర్సిపి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు దమ్ముంటే సవాల్కు సిద్ధం కావాలన్నారు, గత 100 సంవత్సరాలుగా సర్వే నెంబరు 1509 లోని వాగు పోరంబోకు భూమి ని చదును చేసుకుని హద్దులు ఏర్పరచుకొని సమాధులు కట్టుకుని స్మశాన వాటికగా ఉపయోగిస్తున్నది వైసిపి వల్లేనని స్మశాన భూమిలో బోర్లు వేసి చదును చేసి వ్యవసాయం చేసుకుంటున్నది వైసిపి వాళ్ళని, అయ్యవారిపల్లె గ్రామంలో ని స్మశానం లోనే రెవెన్యూ వారి సమక్షంలో బహిరంగ చర్చలకు జనసేన సిద్ధం అని, మేము ఆక్రమించినట్లు నిరూపిస్తే పేద ప్రజలకు పంచడానికి నేను సిద్ధంగా ఉన్నాను, , మరి వైసిపి వాళ్లు ఆక్రమించినట్లు రుజువైతే భూమిలేని పేదలకు పంచడానికి వైసిపి వాళ్ళు మీరు సిద్ధమా అని ఆయన అన్నారు. రాజకీయాలలో నేను 1995 నుండి రాజకీయాలలో రెండు దఫాలు ఎంపీటీసీగా, సర్పంచ్ గా, కొంతకాలం కోడూరు మండల పార్టీ అధ్యక్షుడుగా, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా ఉమ్మడి కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడుగా ఉన్నానని, నా గ్రామ పంచాయితీ లో వందల ఎకరాలు ఖాళీ బీడు భూములు ఉన్నాయని, నేను వివిధ హోదాలలో అధికారాన్ని అనుభవించానని,భూ కబ్జాలు చేయలేదన్నారు. ఉన్నట్లు నిరూపిస్తే రెవిన్యూ అధికారుల సమక్షంలో పేద ప్రజలకు పంచడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా మాపైన చేసిన దాడులు, పెట్టిన అక్రమ కేసులు అన్ని ఇన్ని కాదని , మా పూర్వీకుల నుండి మా అనుభవంలో ఉన్న కోడూరు రెవెన్యూ సర్వేనెంబర్ 1522/3. 0.30 సెంట్ల భూమిలో ఉన్న120 సంవత్సరముల వయసు గల చెట్టును గ్రామ అవసరాలైన దిన కర్మ కాండలు నిర్వహించుకొనుటకు ప్రజలు ఉపయోగిస్తున్నారు



అలాంటి రావి చెట్టును మాపై పగతో పుల్లంపేట మండలానికి చెందిన వైయస్సార్ పార్టీ నాయకుడు అనంతరాజుపేట ఎంపీటీసీ, బుడుగుంట పల్లెకు చెందిన ఒక చోటా నాయకుడు ఆ చెట్టును దాని చుట్టూ నిర్మించిన ఐరన్ ఫెన్సింగ్ సిమెంట్ పోళ్లు అంతా పోలీసులు రెవెన్యూ యంత్రాంగం సమక్షంలో అధికారాన్ని ఉపయోగించి బుల్డోజర్లతో పెకిలించి వేయడంజరిగినది,ఇదేమి అన్యాయం,దౌర్జన్యం అని కోడూరు తహసిల్దారు కార్యాలయం ఎదుట అర్ధ నగ్న నిరసన చేస్తే, కోడూరు తాసిల్దారు ద్వారా మా మీద కేసులు పెట్టించడం జరిగినదని తెలిపారు. పట్టా భూమిలో ఉన్న ఫెన్సింగ్ ను దౌర్జన్యంగా అధికారుల సమక్షంలోధ్వంసం దుర్మార్గమన్నారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని కోడూరు ప్రాంతంలో వైయస్సార్ పార్టీ నాయకులు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు గత పాలకులు బత్యాల చెంగల్ రాయుడు కస్తూరి విశ్వనాధ్ నాయుడు అలా చేసి ఉంటే కోడూరు ప్రాంతం రావణ కాష్టం అయి ఉండేదని, వారుకోడూరు ప్రాంతాన్ని శాంతియుతంగా, సుభిక్షంగా,పాలించరన్నారు, వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో అయ్యవారిపల్లి గ్రామంలో బంధువులు ఒక దారి విషయంలో గొడవలు పడి కొట్టుకుంటే, మహిళలు అని కూడా చూడకుండా 307, మరియు ఇతర సెక్షన్లు పెట్టి 42 రోజులు జైలులో పెట్టించారని, ఆ గొడవలలో నాకు సంబంధం లేకున్నా, నేను తిరుపతిలో ఉన్న నామీద కేసులు పెట్టించారని, పశు వులే జీవనాధారంగా బ్రతికే కుటుంబాలు దిగులుతూ అన్నం ,నీళ్లు తీసుకోకుండా జైలులో ఉంటే, వారి జీవనాధారమైన ఆవులు, బర్రెలు , గొర్రెలు , మేకలు నీళ్లు మేత పెట్టేవారు లేక దొడ్లకు పరిమితం అయినయ్ అని, దొడ్లలో ఆ మూగజీవాల అరుపులు వర్ణనతీతం అని, వైసిపి వాళ్లు మనుషుల మీదనే కాదు, మూగజీవాల మీద కూడా కక్ష సాధిస్తారని గంగయ్య యాదవ్ తెలిపారు. మా గ్రామ పంచాయతీకి చెందిన కొంతమంది నాయకులు కోడూరు టిడిపి ఇన్చార్జ్ దగ్గర ఉంటూ, వైయస్సార్ పార్టీకి చెందిన పుల్లంపేట మండల స్థాయి నాయకుడితో అంతర్గత చర్చలు జరుపుతూ మా గ్రామ పంచాయతీలోని గ్రామాలలో అరాచకాలు, అశాంతికి ప్రేరణలు చేస్తున్నారనీ , గ్రామపంచాయతీలో జరుగుతున్న సంఘటనలపై పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామ ప్రజలు ప్రశాంతాముగా జీవించే భాగ్యం కలిగించాలని ఆయన కోరారు,

# కొలిచేవారికి కొంగు బంగారం..

# శ్రీ రేణుక ఎల్లమాంబ

**--రమణీయంగా రేణుక ఎల్లమ్మ రథోత్సవం -కోసిగిలో ఘనంగా ఎల్లమ్మ జాతర**





**ఎమ్మిగనూరు, 7,( రిపబ్లిక్ న్యూస్)**

మండల కేంద్రమైన కోసిగిలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ రేణుక ఎల్లమాంబ భక్తులు పాలిట కల్పతరువుగా విరజిల్లుతూ కొలిచేవారికి కొంగుబంగారమై కోర్కెలు తీర్చే తల్లి గా పేరొందింది. ప్రతి సంవత్సరం మాఘమాసం బహుళ పంచమి రోజున శ్రీ ఎల్లమాంబ రథోత్సవం జరుగుతుంది. ఇందులో భాగంగా నేడు ఎల్లమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించుటకు అధికార యంత్రాంగం , ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు,అన్ని ఏర్పాట్లు చేశారు .స్థానిక దేవాలయం ఆవరణంలో లక్షలాది మంది భక్తుల కోలహాలం మధ్య సాయంత్రం సంధ్య సమయంలో రథోత్సవం కన్నుల పండుగగా జరగనున్నది. కర్నూలు జిల్లా వాసులతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర తమిళనాడు, రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు.

### అమ్మవారి ఒక్కసారి చరిత్రను పరిశీలిస్తే....

కోసిగిలో కరువు కాటకాలు ఏర్పడి పూటగడవని కాలంలో ,స్థానికంగా ఉన్న ఒక రైతు కుటుంబం కర్ణాటకలోని నీరు సమృద్ధిగా ఉండే ప్రాంతమైన నీరు మానివి గ్రామానికి వలస వెళ్లడం జరిగింది.అక్కడ కూలీ పనులు చేసుకుంటూ పొలాల సమీపంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగించేవారు. కూలి పనులు ముగించుకొని వారిచ్చిన ధాన్యపు గింజలు సరుకులు, సరంజామాను , సద్దుకుని ఓ గంప లో వేసుకుని తిరిగి కోసిగి గ్రామానికి రావడం జరిగింది. అయితే వారు తెచ్చిన గంపలో నుంచి సామాన్లు బయటికి తీస్తుండగా రేణుక ఎల్లమ్మ విగ్రహం కనిపించింది. విగ్రహం పొరపాటున సామాన్ల లో కలిసి వచిందేమోనని ఆ విగ్రహాన్ని పెద్దగా పట్టించుకోకుండా ఇంట్లో ఓ మూలాన పెట్టడం జరిగింది. అయితే ఆ మహిమాన్వితురాలు అయినా ఎల్లమ్మ విగ్రహం అర్ధరాత్రి వేళల్లో గజ్జల సవ్వడి చేస్తూ, గంటా నినాదం చేసేది. ఆ శబ్దం విని ఆ కుటుంబ సభ్యులు భయాందోళన చెంది స్థానికంగా ఉండే ఓ పెద్దమనిషిని సంప్రదించి తమ ఇంట్లో జరిగే వింతల గురించి వారికి తెలియజేశారు. .ఒక మంగళవారం రాత్రి సదరు పెద్ద మనిషి రైతు ఇంట్లో నిద్రించాడు. యధావిధిగా అర్ధరాత్రి దాటిన తర్వాత గజ్జల సవ్వడితో గంటనాదం వినిపించింది. వెంటనే ఆ పెద్దమనిషి మేల్కొని ధైర్యంగా ఎవరు నీవు ..ఎందుకు ఇలా ఇంట్లో వారిని కలవర పెడుతున్నావు? నీకు ఏమి కావాలంటూ నిలదీశాడు. అదృశ్య రూపంలో ఆ ఉన్న శక్తి మాత బదిలీస్తూ నేను ఎల్లమాంబను నాకు పూజలు చేస్తే మీకు మీ కుటుంబాలకు మేలు జరుగుతుందని , గ్రామం కూడా సుభిక్షంగా ఉంటుందని ,గ్రామ ప్రజలుకూడా సుఖశాంతులతో, పాడిపంటలతో సంతోషంగా ఉండే విధంగా అభయమిస్తానని తన విగ్రహాన్ని ప్రతిష్ఠింపచేయాలని చెప్పి అదృశ్యమైంది. దీంతో దేవత చెప్పిన ప్రకారం ఆ రైతు ఇంట్లో ప్రతిష్ఠించి పూజలు చేయడం మొదలుపెట్టారు .దీంతో ఆ కుటుంబంలో ఉన్న కష్టాలు తొలగిపోయి సంపూర్తిగా అభివృద్ధి చెందడంతో గ్రామ పెద్దలంతా కలిసి గ్రామం సుభిక్షం కోసం గ్రామ పొలిమేరలలో ఎల్లమ్మ గుడిని కట్టించి ఎల్లమ్మ తల్లిని ప్రతిష్ఠింపజేసి అప్పటినుండి పూజలు చేయడం ప్రారంభించారు. అయితే ఎల్లమ్మను గంప ఎల్లమ్మ అని, శ్రీ రేణుక ఎల్లమ్మఅని ఇలా ,అనేక పేర్లతో భక్తులు పిలుస్తూ కొలుస్తూ,పూజిస్తూ ఉంటారు. ఎల్లమ్మ ప్రత్యేకత ఏమిటంటే వివిధ చర్మ రోగాలు మాయం అవ్వడానికి భక్తులు మొక్కుబడిగా ఉప్పు, గుగ్గిళ్ళు సమర్పించుకుంటారు. భక్తులు పంచలోహ విగ్రహంతో ఉన్న ఎల్లమాంబ విగ్రహమును సంప్రదాయబద్ధంగా గంపలోఉంచి జాతర సమయంలో గుడికి పౌర్ణమి నాడు రహస్యంగా తీసుకురావడం ఆనవాయితీగా ఉంది . సాయంత్రం ఐదు గంటలకు దేవి విగ్రహాన్ని రథం లోఉంచి లక్షలాదిమంది భక్తుల హర్షధ్వనుల మధ్య రథాన్ని అమ్మవారి సన్నిధి వరకు లాగి యధా స్థానంలో ఉంచుతారు .గతంలో ఎల్లమ్మ జాతర అంటే నెలరోజుల పాటు జరిగేదని పెద్దలు చెబుతూ ఉంటారు. కానీ కాలక్రమేణ అది కాస్తా తగ్గిపోయి ప్రస్తుతం వారం రోజులు మాత్రమే జరుగుతుంది జాతరకు వచ్చిన భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని అనంతరం జాతరలో కోసిగి ప్రత్యేకత అయిన కాల్చిన మాంసాన్ని తిని వెళ్లడం ఒక ప్రత్యేకత. అని పలువురు అంటూ ఉంటారు. రథోత్సవ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీ నాయకులు హాజరవుతారు .ముఖ్యంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు తిక్కరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి రాఘవేంద్ర రెడ్డి, ,కోసిగి దొరల వంశస్తులు మురళి దొర, సుందరాజ్ దొర, శ్రీనివాస్ దొర లు హాజరై అమ్మా వారికి ప్రత్యేక పూజలు చేస్తారు.. ఈ సందర్భంగా ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎమ్మిగనూరు డిఎస్పీ భార్గవి నేతృత్వంలో కోసిగి సిఐ మంజునాథ్ ఆధ్వర్యంలో ఎస్సై రమేష్ రెడ్డి లు అదనపు సిబ్బందితో కలసి భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అలాగే జాతరలో డ్రోన్ కెమెరాలను కూడా ఉపయోగించి పర్యవేక్షణ చేస్తూ నిఘా ఉంచుతున్నట్లు పోలీసులు తెలిపారు . కోసిగి సర్పంచ్ సంజిపోగు అయ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి రంగస్వామి గ్రామ పెద్దలు మాణిక్యరాజు రాజేష్ తదితరుల ఆధ్వర్యంలో గ్రామంలో జాతర్లో తాగునీరు పరిసరాల పరిశుభ్రత వీధిలైట్లపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు .అలాగే వచ్చిన భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులు ,నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు.జాతరలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో ఆయకట్టు కుంటాయి.



## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**- ఏఐటీయూసీ సిపిఐ**



**ఓర్వకల్లు ప్రతినిధి ,ఫిబ్రవరి 7, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండలం శనివారం బిజెపి కేంద్రంలో రెండవ విడత అధికారంలోకి వచ్చిన తర్వాత పార్లమెంట్లో తనకున్న మందబలంతో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల ను ఆమోదించింది ఈ ఆరు సంవత్సరాలుగా దేశంలో అనేక నిరసనలు లేబర్ కోడ్ల కు వ్యతిరేకంగా జరుగుతుండడంతో అవి ఆచరణలో అమలులోకి రాలేదు . లేబర్ కోడ్లు రద్దు చేయాలని తదితర అనేక కార్మిక సమస్యలపై ఈనెల 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని శనివారం రోజు ఓర్వకల్లు మండల బస్టాండ్ లో ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ మండల నాయకులు బాలరంగయ్య సిపిఐ మండల కార్యదర్శి రమేష్ సహాయ కార్యదర్శి సుధాకర్ రైతు సంఘం మండల అధ్యక్షులు మహబూబ్ బాషా ఏఐవైఎఫ్ నాయకులు వలి ఆటో యూనియన్ నాయకులు బాబు రమేష్ రఫీ సాయి మరియు తదితరులు కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది

## మహాశివరాత్రి సందర్భంగాశ్రీ బుగ్గ రామేశ్వరం ఉత్సవాలకు పలు జాగ్రత్తలు తీసుకుంటున్న అధికారులు

**ఓర్వకల్లు ప్రతినిధి, ఫిబ్రవరి 7, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కాల్వబుగ్గదేవాదాయ శాఖ ఈవో మద్దిలేటి కాల్వబుగ్గ ఆలయ కమిటీ చైర్మన్ నారాయణ, ఆలయ కమిటీ సభ్యులు ప్రతిరోజు ఆలయ ఆవరణలో భక్తులకు ఇబ్బంది కలవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు, బ్రహ్మోత్సవాల సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల సందర్భంగా జరిగే రథోత్సవ కార్యక్రమం గతం కంటే ఈసారి చాలా ఎక్కువగా భక్తులు రావడం జరుగుతుంది,మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని త్రాగునీరు సమస్య లేకుండా చేస్తున్నాను,పారిశుధ్యం, విద్యుత్ సమస్య లేకుండా,స్త్రీ,పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండే విధంగా ఆలయ కమిటీ పలు జాగ్రత్తలు తీసుకుంటుంది, ఆలయ ప్రాంతంలో ప్రత్యేకంగా చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉండేలా



చేస్తున్నాము కరెంటు సంబంధించిన అధికారులకు కరెంటు పోకుండా ఉండేలా చూడాలని చెప్పారు, భక్తులకు ఇబ్బంది లేకుండాప్రతి అధికారి సహకరించాలని చెప్పడం జరిగింది,అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నందున. అందరూ భాగస్వాములై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు , కోనేరులో నీరు తగ్గకుండా నీరు పారుతూనే ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు, వచ్చిన భక్తులకు ఇటువంటి ఇబ్బంది పడకుండా ఉండేలా





జాగ్రత్తలు తీసుకుంటున్నాము వచ్చే భక్తులకు అహనాదారులకు ప్రత్యేకంగా పార్కింగ్ ప్లేస్ చేయడం జరుగుతుంది, అందరూ అధికారులు సహకరించాలని కోరారు

## బాల్య వివాహాల నివారణ సామాజిక బాధ్యత

### జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పిలుపు

**శ్రీ సత్యసాయి ప్రతినిధి, ఫిబ్రవరి 07, (రిపబ్లిక్ న్యూస్):**

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఉన్నాయని, ఎదుగుతున్న సమాజానికి ప్రతిబంధకం అవుతాయని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. బాల్య వివాహాలు సామాజిక రుగ్మతగా పేర్కొన్న ఆయన.. వాటి నివారణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి, ముందుకు వచ్చి, అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై జిల్లా స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించడం కోసం రూపొందించిన బాల్య వివాహ విముక్తి రథంను జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2030 సంవత్సరం నాటికి భారతదేశంలో బాల్యవివాహాలు జరగకుండా చేసి బాల్య వివాహ రహిత భారతదేశాన్ని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రజలు, విద్యార్థులు ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ యుద్ధ ప్రాతిపదికన విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో సమత స్వచ్ఛంద సంస్థ ఈ ప్రచార రథము ద్వారా శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రచారం చేయడానికి సంకల్పించడం హర్షనీయం అన్నారు.

**18 సం"ల బాలికల చదువు కొనసాగించేలా కృషి చేయాలి**

భారత దేశంలో బాల్యవివాహాలు జరుగుతున్న రాష్ట్రాలలో మన రాష్ట్రం 6 వ స్థానంలో ఉంది. వీటిని తగ్గించి బాల్య




వివాహరహిత శ్రీ సత్యసాయి జిల్లాగా అందరం కలిసి రూపొందించుకుందామని తెలిపారు. 18 సంవత్సరముల లోపు బాలికలను బడిలోనే ఉంచి చదువు కొనసాగించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా బాల్య వివాహం జరుగుతున్నట్లు ఎవరికైనా సమాచారము ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నెంబర్ కు, పోలీసు వారి 112 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలన్నారు. అదేవిధంగా బాల్యవివాహాల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేకమైన యంత్రాంగాలు ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా బాల్య వివాహ నిషేధ అధికారులను నియమించింది. ఆ అధికారులకు బాల్య వివాహ సమాచారాన్ని ఎక్కడికక్కడ తెలుపుతూ గణనీయంగా బాల్య వివాహాలు తగ్గించాలని పిలుపునిచ్చారు.

**టీనేజీ ప్రెగ్నెన్సీలను తగ్గించాలి**

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల మాట్లాడుతూ ఈ ప్రచార రథం సేవలను గ్రామస్థాయిలో అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ ప్రచార రథం ద్వారా ప్రజలందరూ అవగాహన పొంది బాల్యవివాహాలను నివారించి తద్వారా మాతా శిశు మరణాలను, టీనేజీ ప్రెగ్నెన్సీలను తగ్గించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న బాల్య వివాహ నిషేధ, పర్యవేక్షణ కమిటీ సభ్యుల గురించి అవగాహన కల్పించుకొని బాల్యవివాహాలు జరుగుతుంటే ఆ సమాచారాన్ని ఆ కమిటీ సభ్యులకు కూడా తెలపవచ్చు అని తెలిపారు.

**బాల్య వివాహ రహిత భారతదేశ నిర్మాణం**

సమత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ మా సమత స్వచ్ఛంద సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లాలలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, బాలలపై జరిగే అత్యాచారాల నివారణ కోసం పనిచేయడం జరుగుతున్నదని తెలిపారు. బాల్య వివాహ రహిత భారతదేశ నిర్మాణంలో భాగంగా సమత స్వచ్ఛంద సంస్థ శ్రీ సత్యసాయి జిల్లాలో పురోహితులు, మౌల్వేలు, చర్చి పాస్టర్లు, డ్వాక్రా సంఘాలు, పెళ్లికి క్యాటరింగ్ చేసే వారికి, సప్లయర్స్ వారికి, టైలర్లకు, గ్రామస్థాయి ప్రభుత్వ అధికారులకు, పాఠశాలలు, కళాశాలలలో బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలపై మరియు బాల్య వివాహ నిషేధ చట్టం 2006 గురించి, అందులోని శిక్షల గురించి అవగాహన కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సువర్ణ గారు, డీఎస్పీ ఇందిర గారు, ప్రభుత్వ వైద్యాధికారిణి మరియు వైద్య సిబ్బంది, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, సమత స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయుడు, సెక్రటరీ వెంకటేశులు, మనోహర్ నాయుడు, ఉమా శంకర్ రెడ్డి, సమత స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్లు సునీత, శారద, కళావతి పాల్గొన్నారు



## సీఎం చంద్రబాబుకు మహానంది ఉత్సవాల ఆహ్వానం

**మహానంది, ఫిబ్రవరి 7,( రిపబ్లిక్ న్యూస్)**



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ లను ఆహ్వానించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేద పండితులు రవిశంకర్ అవధాని, ఉప ప్రధాన అర్చకులు మూలస్థానం శివశంకర శర్మ, జనార్దన శర్మ, వేద పండితులు హనుమంతు శర్మ, అర్చకుడు రఘు శర్మలు సీఎం చంద్రబాబును కలిసి ఆహ్వాన పత్రికలు అందించడంతో పాటు వేద ఆశీర్వచనం చేశారు. మహానందీశ్వర స్వామి వారి చిత్ర పటం అందించారు. శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వివరించారు. ఆలయ అభివృద్ధి కోసం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రంథాలయమునకు పుస్తక వితరణ

## ఇస్కాన్ వారి పుస్తక వితరణ

## ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సమాజానికి అందజేత



**నంద్యాల ఫిబ్రవరి 7( రిపబ్లిక్ న్యూస్) :** పట్టణంలో ఎస్.బి.ఐ కాలనీలోగల ఇస్కాన్ టెంపుల్ వారు రూ 8000 /- విలువ గల తెలుగు భాషలో ఉన్న "శ్రీమద్భాగవతము"(12 స్కంధములు) 18 పుస్తకములను స్థానిక నంద్యాల గ్రంథాలయం" శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంకు విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా నంద్యాల ఇస్కాన్ టెంపుల్ ఇంచార్జ్ చరణార విందా దాస్ మాట్లాడుతూ నంద్యాలలో గల పలు విద్యాసంస్థలకు మరియు గ్రంథాలయాలకు ఈ శ్రీమద్భావతము గ్రంథములను 20 సెట్లదాకా పుస్తక వితరణ చేయడమైనదని, ఈ కార్యక్రమంలో భాగంగానే శనివారం నంద్యాల పద్మావతి నగర్ లో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయమునకు శ్రీమద్భావతము గ్రంథములను ఇవ్వడం జరిగినదని తెలిపారు. ఈ పుస్తక వితరణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం "ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సమాజానికి అందచేయడం". ఈ దిశగా పాఠకులకు పుస్తకం ఒక దిక్సూచిగా ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రంథాలయ ఇన్చార్జ్ ఆర్.ఈ.శ్రీధర్ ఎన్ని మాధ్యమాలు వచ్చినా, ఎంత అభివృద్ధి జరిగినా మనిషికి పుస్తకాల ద్వారా వచ్చే జానమే అంతిమమైనదని అన్నారు. గ్రంథాలయంలో ఆధ్యాత్మిక పుస్తకాలతో పాటు, వివిధ పోటీ పరీక్షలు గ్రూప్స్ ,బ్యాంక్స్, ఆర్.ఆర్.బి,టెట్ మరియు డీఎస్సీ సంబంధించిన పుస్తకాలు, అలాగే పిల్లలు మనోవిజ్ఞానాన్ని సంపాదించుకునేందుకు ఎన్నో రకాల కథల పుస్తకాలు, అదేవిధంగా పలు పుస్తక ప్రియులకు కావలసిన సాహితీ పుస్తకాలు, నవలలు అందుబాటులో ఉన్నాయని,ఈ పుస్తకాలను వంద రూపాయలు చెల్లించి జీవితకాల గ్రంథాలయసభ్యత్వం (లైఫ్ టైం లైబ్రరీ మెంబర్షిప్) తీసుకుని ఇళ్లకు తీసుకొని వెళ్లవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేదార్నాథ్, నరేంద్ర శర్మ, సుబ్బారావు, శ్రీనివాసులు, తేజ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

## - క్రీడలు విద్యార్థులలో ఆత్మస్థైర్యం కలిగిస్తాయి: ఆదాయ పన్ను అధికారి రమణారావు

## - తైక్వాండో బెల్టులు ప్రధానం



**నంద్యాల ఫిబ్రవరి 7 (రిపబ్లిక్ న్యూస్) :** కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష పోటీలలో 140 మంది తైక్వాండో క్రీడాకారులు పాల్గొని వివిధ కేటగిరి బెల్ట్ లు సాధించారు. ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్ టి చంద్రమౌళి ఆధ్వర్యంలో, మాస్టర్ బాలకృష్ణ నిర్వహణలో, కర్నూలు జిల్లా మాజీ ఒలంపిక్ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రదానోత్సవం లో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, చిత్తూరు జిల్లా ఆదాయ పన్ను అధికారి రమణారావు,నంద్యాల జిల్లా క్రీడాభారతి అధ్యక్షులు సుధాకర్ అతిథులుగా పాల్గొని క్రీడాకారులకు వివిధ కేటగిరి బెల్ట్ లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆదాయ పన్ను అధికారి రమణ రావు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో ఆత్మస్థైర్యం, శారీరిక దారుఢ్యం, మానసిక వికాసం, క్రమశిక్షణ, ఏకాగ్రతలను ఇనుమడింపచేస్తాయని అన్నారు. సుధాకర్ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ క్రీడలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంచుతుందని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ తైక్వాండో ఒలింపిక్ లో గుర్తింపు పొందిన క్రీడ అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

# అగ్నిప్రమాద బాధితులకు ఎన్ఎండి ఫిరోజ్ భరోసా

## 10,000 ఆర్థిక సాయం అందజేత



**నంద్యాల, ఫిబ్రవరి 07: (రిపబ్లిక్ న్యూస్)**
నంద్యాల పట్టణంలోని 38వ వార్డు ఎస్పీవై రెడ్డి స్మార్ట్ సిటీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన అత్యంత దురదృష్టకరమని నంద్యాల జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు 38 వ వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు పేర్కొన్నారు. శనివారం వారు ప్రమాద బాధితులను ప్రత్యక్షంగా కలిసి పరామర్శించారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితుల పరిస్థితిని చూసి చలించిన ఎన్ఎండి ఫిరోజ్ , 38 వ వార్డు ఇంచార్జి బుగ్గరాముడు గారి ఆధ్వర్యంలో నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ₹10,000 నగదును తక్షణ ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ ప్రమాదంపై అధికారులతో మాట్లాడి, ప్రభుత్వం నుండి బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకువస్తామని ఫిరోజ్ హామీ ఇచ్చారు. బాధితులు అధైర్య పడకూడదని, తెలుగుదేశం పార్టీ వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా వారు భరోసా ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో తాటికొండ మహేష్, లింగమయ్య, ప్రవీణ్, చౌడన్న, శేకర్, కేశాలు, అబ్దుల్లా, చిన్న రాయుడు, జాన్సన్, సౌభాగ్య,శేసన్న స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు రోస్టర్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

## - జిల్లా అధ్యక్షులు సుబ్బన్న



**నంద్యాల ఫిబ్రవరి 7 (రిపబ్లిక్ న్యూస్) :**
భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తన సర్వస్వాన్ని పణంగా పెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రాజ్యాంగంలో అనేక అవకాశాలు కల్పించారని మాల ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో శుక్రవారం రాత్రి ఎస్సీ కమిషన్ సభ్యుడు గౌతమ్ రాజును మాల ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బన్న, జిల్లా నాయకులు కలిశారు

ఎస్సీ ఎస్టీలకు ఉద్యోగాలలో రిజర్వేషన్లతో పాటు పదోన్నతులలో కూడా రిజర్వేషన్లు కల్పించడం జరిగింది.
ఇటీవల కాలంలో చాలా డిపార్ట్మెంటులలో ఉద్యోగుల పదోన్నతులలో రిజర్వేషన్లు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రోస్టర్ పుస్తకమును కూడా అమలు చేయడం లేదు.
ఉద్యోగాల నియమాకాలలో మెరిట్ వచ్చిన విద్యార్థులను కూడా రిజర్వేషన్లలో చూపిస్తూ కేవలము 15% రిజర్వేషన్లకు మాత్రమే పరిమితం చేస్తూ నియామకాలు చేపడుతున్నారు. దీనివలన అనేకమంది ఎస్సీ వారు ఉద్యోగాలు పొందకుండా నష్టపోతున్నారు.
ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ను నిర్వీరం చేసే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు.
ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా, వివక్షత చూపుతూ, అవమానకరంగా విధంగా వ్యవహరిస్తున్నారు. పై విషయాలు అన్నిటిని పరిశీలించి అన్ని డిపార్ట్మెంటులలో ఎస్సీ రోస్టర్ బుక్కును మరియు రిజర్వేషన్లు అమలు అయ్యేలా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని అంతేకాకుండా జనాభా ప్రతిపాదికన ఎస్సీ రిజర్వేషన్లను 25% పెంచాలని ఎస్సీ కమిషన్ గౌతమ్ రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మద్దయ్య, గౌరవ అధ్యక్షులు లక్క భూషణం, మునిస్వామి వెంకటేశ్వర్లు, వీరేష్, పుల్లయ్య, రాజశేఖర్, సోమయ్య, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

**ఫిబ్రవరి 23 నుండి మార్చి 24 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు**

**జిల్లాలో 55 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ**

**సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి**




**నంద్యాల, ఫిబ్రవరి 07 (రిపబ్లిక్ న్యూస్)**
ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ యుగంధర్ బాబు, డీఆర్ఓ రాము నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఈఓ జనార్దన్ రెడ్డి, డీఐఓ శంకర్ నాయక్, జిల్లా కార్మిక అధికారి బషీరున్నిసా, ఎస్ఎస్ఎ పీఓ నిత్యానంద రాజు, డీఈసీ సభ్యులు సునీత, సుంకన్న, మద్దిలేటి స్వామి, రమణ, శ్రీకాంత్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో అన్ని పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను అమలు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు డిప్యూటీ తహశీల్దార్లను కేటాయించాలని డీఆర్ఓను ఆదేశించారు. జిల్లాలోని 55 పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 15,443 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం పరీక్షలకు 14,424 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, మొత్తం 29,867 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షా కేంద్రాల్లో తగినంత లైటింగ్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా గదిలో గోడ గడియారం ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సమయానికి చేరుకునేలా ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రహదారులకు సమీపంలో ఉన్న పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్షలు ముగిసిన వెంటనే సమాధాన పత్రాలను భద్రతతో పోస్టు కార్యాలయాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పోస్టల్ శాఖ అధికారులను ఆదేశించారు.
అదనపు ఎస్పీ యుగంధర్ బాబు మాట్లాడుతూ, ప్రశ్న పత్రాల సెట్టు నెంబర్లు అందిన వెంటనే పోలీసు ఎస్కార్ట్‌తో పరీక్షా కేంద్రాలకు ప్రశ్న పత్రాలు తరలించే ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని అన్నారు.

# వైద్య కళాశాలలో నకిలీల బాగోతం

**ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తెచ్చిన ఏ ఐ ఎస్ బి**

**నిరుద్యోగులకు న్యాయం చేయాలి**

**ఓబులేసు, తెలంగాణ వాసి మూర్తి లను తొలగించాలి**

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ**

**కాసులకోసం కక్కుర్తి .. ఎ.డి సాయి గ్రేస్ కీలక పాత్ర**

**ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం పై నిరుద్యోగుల మండిపాటు**

**అధికారులు స్పందించకుంటే ఆందోళనలు చేస్తాం**



**అనంతపురం వైద్యం, ఫిబ్రవరి 07,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నకిలీ ఉద్యోగుల బాగోతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారి బట్టబయలు అయింది. 2010 లో విద్యార్హత సాధించిన ఓబులేసు అనే ఉద్యోగికి, 2007 లోనే ఉద్యోగం కల్పించారు. అనంత నిరుద్యోగులను పక్కనబెట్టి తెలంగాణ రాష్ట్ర వాసి అయిన మూర్తి అనే వ్యక్తికి ఉద్యోగం కల్పించారు. అప్పటి నియమాలు ఉల్లంఘించి లోకల్ కాండిడేట్ కి కాకుండా లోకల్ జోన్ కూడా కాకుండా ఇతర వ్యక్తులకు ఉద్యోగం కల్పించడం పై నిరుద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2019 లో స్పష్టంగా అప్కాస్ విలీనంలో చేసే ప్రక్రియలో వీరిని గుర్తించి కూడా చర్యలు తీసుకోకుండా కాసులకు కక్కుర్తి పడి లక్షలు నగదు వసూలు చేసి అప్పటి ఏవో గా విధులు నిర్వహించిన సాయి గ్రేస్ ప్రస్తుత ఏ.డి గా ఉన్న అధికారిణి అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం బయటకు రాకుండా రికార్డులను మాయం చేసే ప్రయత్నం చేశారన్నారు. రోస్టర్ పాయింట్లు, అప్కాస్ విలీనం నియమాలు ఉల్లంఘించి అప్కాస్ లోకి మెర్జింగ్ హై కోర్టు ఆదేశాలు ఉల్లంఘన కొనసాగించాలన్నారు. ఇదే విషయంలో ఇతర జిల్లాలలో ఉద్యోగుల తొలగింపు ప్రక్రియ,అనంతలో కొనసాగించారన్నారు. డి ఎమ్ ఈ ఆదేశాలు ఉల్లంఘన, అధికారులను , జిల్లా కలెక్టర్ ను సైతం బురిడీ కొట్టించి నియామకాలు, అప్కాస్ విలీనం చేయడం పై భారీ స్థాయిలో అక్రమాలు లక్షల్లో ముడుపులు ముట్టాయన్నారు. నకిలీ ఉద్యోగులకు ఆర్డర్ కాపీలు లేవని నిరుద్యోగుల తరుపున పోరాడుతున్న అఖిల భారత విద్యార్థి బ్లాక్ వెంటనే వీటిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, ఏ .డి సాయి గ్రేస్, ఇతర సిబ్బంది పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ కు ఏ ఐ ఎస్ బి ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ వినతి పత్రం అందజేశారు.

# ఆత్మకూరు నుండి శ్రీశైలం వెళ్లే కాలినడక మార్గం, భక్తులక సౌకర్యాల పరిశీలన

## భక్తుల భద్రత దృశ్య కాలినడక మార్గంలో పటిష్ట చర్యలు - జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్





**నంద్యాల క్రైం, ఫిబ్రవరి 7, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలోని మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేశం నలుమూలల నుండి తరలివచ్చి ఆ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శనం చేసుకోనున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంలో భాగంగా ఆత్మకూరు నుండి శ్రీశైలంనకు వెళ్లే కాలినడక మార్గాన్ని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆత్మకూరు నుండి శ్రీశైలంనకు వెంకటేశ్వరపురం మీదుగా నాగలూటి గూడెం, వీరభద్ర స్వామి టెంపుల్, అడవిలో గల బేస్ క్యాంప్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటుచేసిన నీళ్లు, ఆహారం తదితర వసతులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీశైలంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నేటి నుండి వెంకటేశ్వరపురం మీదుగా శ్రీశైలంనకు వెళ్లే కాలినడక మార్గాన్ని ప్రారంభించడం జరిగిందని, ఈ మార్గంలో భక్తుల సౌకర్యార్థం ఆహారం, నీరు తదితర సౌకర్యాలను కల్పించడంతోపాటు భక్తుల భద్రత కొరకు కాలినడక మార్గాన్ని పోలీస్ బాంబ్ డిస్పోజల్ టీం సహాయంతో తనిఖీ చేయడం జరిగిందని, జిల్లా స్పెషల్ పార్టీ సిబ్బందిచే కాలినడక మార్గాన్ని పోలీసు స్వాధీనంలోనికి తీసుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డిఎస్పి రామాంజీ నాయక్, ఆత్మకూరు పోలీస్ అధికారులు, ఫారెస్ట్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ సిబ్బంది పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com